andhrajyothy.com గురువారం ఉష్ణోగ్రత గరిష్ఠం 29.9, కనిష్ఠం 23.4

ఆంధ్రజ్యోతి

నిజామాబాద్

జిల్లా వార్తలు

5 శుక్రవారం 19 జూలై 2024



జిల్లాలో నియోజకవర్గాల వారీగా లక్ష రుణమాఫీ ఇలా..

నియోజకవర్గం	రైతులు	రుణం
ఆర్మూర్	5736	రూ.30.27 కోట్లు
బాల్కొండ	7,120	రూ.40.62 కోట్లు
నిజామాబాద్ రూరల్	11,866	రూ.62.73 కోట్లు
నిజామాబాద్ అర్బన్	112	రూ.42 లక్షలు
బోధన్ నియోజకవర్గం	12,026	రూ.55.18 కోట్లు
బాన్సువాడ	7,609	రూ.36.40 కోట్లు

జిల్లాలో రూ.225.62 కోట్లు మాఫీ



• నగరంలో సీఎం ఫ్లెక్సీకి క్షీరాభిషేకం చేస్తున్న పార్టీ శ్రేణులు

• జిల్లా వ్యాప్తంగా అంబరాన్నంటిన సంబురాలు • సీఎం చిత్రపటాలకు క్షీరాభిషేకాలు

నిజామాబాద్, జూలై 18 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన రుణమాఫీ అమలు మొదలైంది. మొదటి విడత కింద జిల్లాలోని లక్షలోపు రుణం ఉన్న రైతులకు మాఫీ అయింది. జిల్లాలో 225.62 కోట్ల రూపాయలు మాఫీ అయ్యాయి. ప్రభుత్వం రుణమాఫీ అమలు మొదలు పెట్టడంతో గురువారం జిల్లా వ్యాప్తంగా రైతువేదికల్లో కార్యక్రమాలను నిర్వహించారు. బోధన్ రైతువేదిక నుంచి రైతులు సీఎం వీడియోకాన్ఫరెన్స్‌లో పాల్గొనడంతో పాటు రైతుబంధు మాఫీపై హర్షం వ్యక్తం చేశారు. జిల్లాలోని పలు మండలాల పరిధిలో జరిగిన రుణమాఫీ అమలు సందర్భంగా నిర్వహించిన కార్యక్రమాల్లో ఎమ్మెల్యేలు, కార్పొరేషన్ చైర్మన్లు, ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ నేతలు పాల్గొన్నారు. రుణమాఫీ చేపట్టడంతో జిల్లా వ్యాప్తంగా పలు గ్రామాల పరిధిలో సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకాలు చేయడంతో పాటు ర్యాలీలను నిర్వహించారు.

44,469 మంది రైతులకు లబ్ధి

జిల్లాలో లక్షలోపు రుణం ఉన్న రైతులకు సంబంధించి 225.62 కోట్ల రూపాయలు మాఫీ అయ్యాయి. జిల్లాలోని మొత్తం 44వేల 469 మంది రైతులకు సంబంధించిన రుణాలను మాఫీ అయ్యాయి. మొదటి దఫా కింద జిల్లాలోని సన్న, చిన్నకారు రైతులకు చెందిన రుణాలన్నీ మాఫీ అయ్యాయి. జిల్లాలోని ఆర్మూర్ నియోజకవర్గం పరిధిలో 5736 మంది రైతులకు సంబంధించి 30.27 కోట్ల రూపాయలను, బాల్కొండ నియోజకవర్గం నుంచి 7,120 మంది రైతులకు సంబంధించిన 40.62 కోట్లు, నిజామాబాద్ రూరల్ నుంచి 11,866 మంది రైతులకు సంబంధించి 62.73 కోట్లు, నిజామాబాద్ అర్బన్ నుంచి 112 మంది రైతులకు సంబంధించి 42 లక్షలు, బోధన్ నియోజకవర్గం నుంచి 12,026 మంది రైతులకు సంబంధించి 55.18 కోట్లు, బాన్సువాడ నుంచి 7,609 మంది రైతులకు సంబంధించి 36.40 కోట్ల రూపాయలు మాఫీ అయ్యాయి. ఈ డబ్బులను రైతుల ఖాతాల్లో జమ చేయగా బ్యాంకర్లు వారికి రుణమాఫీకి సంబంధించిన పత్రాలను అందించనున్నారు. కొత్త రుణాలను ఇచ్చేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు.

- ప్రారంభమైన రైతు రుణమాఫీ అమలు
- లక్షలోపు రుణం ఉన్న రైతుల ఖాతాల్లో డబ్బులు జమ
- జిల్లా వ్యాప్తంగా 44,469 మంది రైతులకు సంబంధించి రూ.225.62 కోట్లు మాఫీ
- రైతువేదికల్లో నిర్వహించిన వీడియోకాన్ఫరెన్స్‌లో పాల్గొన్న రైతులు
- జిల్లా వ్యాప్తంగా సీఎం చిత్రపటానికి రైతులు, పార్టీ శ్రేణుల క్షీరాభిషేకాలు

రైతువేదికల్లో సంబరాలు

ప్రభుత్వం రుణమాఫీ అమలు మొదలు పెట్టడం మొదటి విడత కింద లక్షలోపు రుణాన్ని మాఫీ చేయడంతో జిల్లాలోని 31 మండలాల పరిధిలో రైతువేదికల్లో సంబరాలను నిర్వహించారు. సీఎంతో జరిగిన వీడియోకాన్ఫరెన్స్‌లో రైతులతో పాటు అధికారులు పాల్గొన్నారు. జిల్లాలో బోధన్ రైతువేదిక నుంచి మాజీ మంత్రి, ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి, కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతుతో పాటు అధికారులు పాల్గొన్నారు. సీఎం రేవంత్‌రెడ్డితో ఈ రైతు వేదిక నుంచి మందర్న రవి అనే రైతు మాట్లాడారు. రుణ మాఫీ వల్ల తమకు మేలు జరుగుతుందని తెలిపారు. నిజామాబాద్ రూరల్ మండలం గుండారం నుంచి ఎమ్మెల్యే భూపతిరెడ్డి పాల్గొన్నారు. జిల్లా వ్యాప్తంగా 31 రైతు వేదికల నుంచి వీడియోకాన్ఫరెన్స్‌లో రైతులు పాల్గొన్నారు. సీఎంతో పాటు మంత్రులు మాట్లాడిన అంశాలను విన్నారు. జిల్లా వ్యాప్తంగా రైతువేదికల నుంచి రైతులతో పాటు అధికారులు ఈ వీడియోకాన్ఫరెన్స్‌లో పాల్గొన్నారు.

సీఎం చిత్రపటాలకు క్షీరాభిషేకాలు

రాష్ట్ర ప్రభుత్వం రుణమాఫీ అమలు చేయడం తో జిల్లా వ్యాప్తంగా సీఎం చిత్రపటాలకు కాంగ్రెస్ పార్టీ నేతల ఆధ్వర్యంలో క్షీరాభిషేకాలు చేశారు. జిల్లాలోని అన్ని మండలాల పరిధిలో బైక్‌ర్యాలీతో పాటు ర్యాలీలను నిర్వహించారు. పెద్దఎత్తున రైతువేదికల్లో హాజరయ్యారు. రుణ మాఫీ వల్ల సన్న, చిన్న కారు రైతులతో పాటు మధ్యతరహా రైతులకు మేలు జరుగుతుందని వారు ప్రకటించారు. ఇచ్చిన మాటకు అనుగుణంగా సీఎం రేవంత్‌రెడ్డి ఈ రుణ మాఫీ చేపట్టారని వారు తెలిపారు. పెద్ద ఎత్తున రుణమాఫీ కావడంతో సన్న, చిన్నకారు రైతులు కూడా ఊరట చెందారు.

సీఎం చరిత్రలో నిలిచిపోతారు..



వీసీలో సీఎంతో మాట్లాడుతున్న మందర్నా రవి

బోధన్‌రూరల్: రైతుల రుణ మాఫీతో సీఎం రేవంత్‌రెడ్డి చరిత్రలో నిలిచిపోతారని సాలూర మండలం మందర్నా గ్రామానికి చెందిన మందర్నా రవి అనే రైతు అన్నారు. గురువారం పట్టణంలోని మార్కెట్ కమిటీ ప్రాంగణంలో గల రైతు వేదికలో లక్ష రూపాయల రుణమాఫీపై సీఎం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా బోధన్ నుంచి రవి సీఎంతో వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడారు. రుణమాఫీపై గతంలో రైతులకు అనుమానం ఉండేదని, 20ఏళ్ల కిత్రం వైఎస్ రాజశేఖర్‌రెడ్డి రుణమాఫీని ఏకకాలంలో అమలు చేసినట్లుగా తమరు అమలు చేయడం శుభపరిణామం అన్నారు. రైతుల ఆశీర్వాదం ప్రభుత్వంపై ఎల్లప్పుడు ఉంటుందన్నారు. రుణమాఫీ చేసిన ముఖ్యమంత్రి, మంత్రులందరికీ రైతుల తరఫున పాదాభివందనం చేస్తున్నామన్నారు.



సీఎం వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి, కలెక్టర్

అంకాపూర్ దేశీ చికెన్ తినిపిస్తావా.. సీఎం రేవంత్ రెడ్డి

'అంకాపూర్ దేశీ చికెన్ తినిపిస్తావా' అంటూ సీఎం రేవంత్‌రెడ్డి వీడియో కాన్ఫరెన్స్‌లో రైతు మందర్నా రవిని అడిగారు. దీంతో రవి మాట్లాడుతూ.. ఇంత గొప్ప కార్యక్రమం చేసిన మీకు భోజనం పెట్టడం రైతన్నల అదృష్టంగా భావిస్తామన్నారు. ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి ఉన్నారా అని సీఎం అడుగగా ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి ఇక్కడే ఉన్నారని మీలాగా తరచూ రైతుల గురించి ఆలోచిస్తారని ఆయన వెంటే మేము ఉంటామని రైతు రవి అన్నారు.

నిధులను ఇతర వాటికి మళ్లించొద్దు : కలెక్టర్



రైతుల రుణమాఫీ కింద ప్రభుత్వం జమ చేసే నిధులను ఇతర రుణాలకు మళ్లించవద్దని కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు బ్యాంకర్లకు సూచించారు. రుణమాఫీకే వర్తింపజేయాలని కోరారు. కలెక్టరేట్‌లో గురువారం బ్యాంకర్లతో సమావేశం నిర్వహించారు. ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం ప్రకారం మొదటి విడత కింద లక్షలోపు రుణాలను మాఫీ చేస్తుందన్నారు. రెండో విడత కింద లక్షన్నర, మూడో విడత కింద రెండు లక్షల లోపు రుణాన్ని మాఫీ చేస్తుందని ఆయన బ్యాంక్ అధికారులకు వివరించారు. రుణమాఫీ కాగానే కొత్తగా రుణాలు అందించాలన్నారు.

రుణమాఫీతో సంతోషంగా ఉంది..



కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో రుణమాఫీ చేయడం చాలా సంతోషంగా ఉంది. గతంలో వైయస్ రాజశేఖర్‌రెడ్డి ముఖ్యమంత్రి ఉన్నప్పుడు రైతులకు రుణమాఫీ చేసింది కాంగ్రెస్ ప్రభుత్వమే. పది సంవత్సరాల తర్వాత అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వమే రుణమాఫీ చేయడం సంతోషంగా ఉంది.

: సుంకరి రాజన్న, రైతు (దత్తాపూర్)

బ్యాంకు లోన్ తీరింది..



రుణమాఫీతో బ్యాంకులో తీసుకున్న లోన్ తీరింది. కాంగ్రెస్ ప్రభుత్వం తెలంగాణలో అధికారం చేపట్టిన కొన్ని నెలల్లోనే రుణమాఫీ చేయడం సంతోషంగా ఉంది. ఎన్నికల్లో ఇచ్చిన హామీని కాంగ్రెస్ నిలబెట్టుకుంది. రైతుల క్షేమం గురించి ఆలోచించిన సీఎం రేవంత్‌రెడ్డికి రైతుల తరఫున ధన్యవాదాలు.

: దేరెడి నాగయ్య రైతు (ఎడపల్లి)



త్రివేణి సంగమం వద్ద పరవళ్లు తొక్కుతున్న గోదావరి

కందకుర్తి గోదారమ్మకు జలకళ

రెంజల్, జూలై 18: నాలుగు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు కందకుర్తి గోదారమ్మ జలకళను సంతరించుకుంది. ఎగువన కురుస్తున్న భారీ వర్షాలతో వరద ఉధృతి రావడంతో హరిద్ర, మంజీరా, గోదావరి నదుల త్రివేణి సంగమం వద్ద నీటి ప్రవాహం పరుగులు తీస్తోంది. మొన్నటి వరకు చుక్కనీరు లేక వెలవెలబోయిన గోదారమ్మ నేడు జలకళను సంతరించుకుంది. ఎగువన ఉన్న బాబ్లీ ప్రాజెక్టు గేట్లు తెరిచి ఉంచడంతో దిగువ ప్రాంతమైన కందకుర్తి గోదావరికి చేరుతోంది. వీటికి తోడు స్థానికంగా కురుస్తున్న భారీ వర్షాలతో త్రివేణి సంగమం క్షేత్రం వద్ద నీటి ప్రవాహం పరుగులు తీస్తోంది. గోదారమ్మ పరవళ్లతో జలకళను సంతరించుకున్న అందాలను తిలకించేందుకు స్థానికులు తరలివస్తున్నారు.

ప్రత్యేక అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించాలి

• కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు

నిజామాబాద్ అర్బన్, జూలై 18: మండల స్పెషల్ ఆఫీసర్లుగా నియమితులైన వివిధ శాఖల జిల్లా అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటిస్తూ ప్రజా సమస్యల పరిష్కారానికి చొరవ చూపాలని కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు సూచించారు. వారానికి కనీసం రెండు రోజులు తప్పనిసరిగా మండలాలను సందర్శించాలని ముఖ్యంగా విద్య, వైద్య రంగాల పనితీరును నిశితంగా పర్యవేక్షణ జరపాలన్నారు. కలెక్టరేట్‌లో గురువారం మండల ప్రత్యేక అధికారులతో కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. ప్రభుత్వ పాఠశాలలు, రెసిడెన్షియల్ స్కూల్, వసతి గృహాలు, ఆసుపత్రులు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను సందర్శించి క్షేత్రస్థాయిలో పరిస్థితులను గమనించాలన్నారు. ఎక్కడైనా లోటుపాట్లు ఉంటే తన దృష్టికి తేవాలని వర్షాకాలం అయినందున సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ముందుజాగ్రత్తలు తీసుకునేలా చర్యలు చేపట్టాలన్నారు. ఎక్కడైనా మలేరియా, డయేరియా, డెంగ్యూ వంటి వ్యాధులు సోకితే అలాంటి ప్రాంతాల్లో విస్తృత స్థాయిలో నివారణ చర్యలు తీసుకునేలా చూడాలన్నారు. పాఠశాల, హాస్టళ్లలో విద్యార్థులతో పాటు బోధన, బోధనేతర సిబ్బందికి, మధ్యాహ్న భోజనం తయారు చేసేవారికి హెల్త్ చెకప్ చేయించాలని అన్నారు. దీని వల్ల సీజనల్ వ్యాధులు ఒకరి నుంచి ఒకరికి సంక్రమించకుండా నివారణ చర్యలు చేపట్టేందుకు వీలవుతుందన్నారు. ప్రజాపాలన సేవ కేంద్రాలను సందర్శించాలని మహిళా సాధికారతే లక్ష్యంగా ప్రభుత్వం అమలు చేస్తున్న మహిళా శక్తి కింద ఆయా యూనిట్లు గ్రౌండింగ్ అవుతున్నాయా లేదా అన్నది క్షేత్రస్థాయిలో పరిశీలించాలన్నా రు. ఎంపీడీవోలు, మండల అధికారులతో పాటు గ్రామ పంచాయతీల ప్రత్యే క అధికారులతో వారానికి ఒక సారి సమావేశమై మండలాల్లోని అన్ని గ్రామాల్లో పరిస్థితులను తెలుసుకోవాలన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో అమ్మఆదర్శ కమిటీ ఆధ్వర్యంలో చేపట్టిన పనులను పరిశీలించి ఒకటి రెండు రోజుల్లో నివేదికలు అందించాలని గడువు విధించారు. వన మహోత్సవం కార్యక్రమంలో భాగంగా విరివిగా మొక్కలు నాటేలా చర్యలు తీసుకోవాలని దిశ నిర్దేశం చేశారు. చెరువులు, కాలువ గట్లపై కాకుండా ఇతర అనుకూల ప్రదేశాలను గుర్తిస్తూ పెద్ద ఎత్తున మొక్కలు నాటి వాటి సంరక్షణకు అవసరమైన చర్యలు చేపట్టాలన్నారు. జిల్లాలో అవెన్యూ ప్లాంటేషన్‌కు ఎక్కువ ఆస్కారం ఉన్నందున రోడ్లకు ఇరువైపులా మొక్కలు నాటేలా చొరవ చూపాలన్నారు. అన్ని మండలాల్లో వన మహోత్సవం లక్ష్యాన్ని సాధించేలా కృషి చేయాలన్నారు. సమావేశంలో అదనపు కలెక్టర్ అంకిత్, నగర పాలక సంస్థ కమిషనర్ మకరంద్, ట్రైనీ కలెక్టర్ సంకేత్, ప్రత్యేక అధికారులు పాల్గొన్నారు.

మోస్తరు వర్షాలు

జిల్లాలో ఇప్పటి వరకు కురిసిన 304.6 మి.మీ వర్షం



నిజామాబాద్, జూలై 18 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): జిల్లాలో ఓ మోస్తరు నుంచి భారీ వర్షాలు కురుస్తున్నాయి. జిల్లా వ్యాప్తంగా వాగులు, చెరువుల్లో నీళ్లు చేరుతున్నాయి. గడిచిన 45 రోజులకు పైగా భారీ వర్షాలు పడకపోవడంతో ఆందోళనతో ఉన్న రైతులు ఈ వర్షాలతో ఊరట చెందుతున్నారు. జిల్లా వ్యాప్తంగా అన్ని గ్రామాల పరిధిలో వర్షం నమోదు కావడం వల్ల రైతులు కూడా వ్యవసాయ పంటల్లో నిమగ్నమయ్యారు. ఈ వర్షాల వల్ల ఎస్సారెస్పీకి కూడా వరద క్రమేపీ పెరుగుతోంది. జిల్లాలో ఇంకా సగటు వర్షపాతం నమోదు కాలేదు. జిల్లాలో బుధవారం రాత్రి నుంచి గురువారం వరకు 15 మిల్లీమీటర్ల వర్షం కురిసింది. జిల్లాలో అత్యధికంగా ఏర్గట్ల మండలంలో 87.1 మిల్లీమీటర్ల వర్షం నమోదైంది. జిల్లాలో అత్యల్పంగా ధర్పల్లి మండలంలో 2.9 మిల్లీమీటర్ల వర్షం పడింది. ఈ వానాకాలంలో ఇప్పటి వరకు 300 మిల్లీమీటర్ల వర్షం పడాల్సి ఉండగా 304.6 మిల్లీమీటర్ల వర్షం పడింది. సరాసరి సగటు కంటే 4 మిల్లీమీటర్ల వర్షం ఎక్కువగా పడిన జిల్లాలోని ఆరు మండలాల పరిధిలో ఇంకా సగటు వర్షపాతం నమోదు కాలేదు. ఆర్మూర్, మోపాల్, సిరికొండ, రుద్రూర్, నిజామాబాద్ నార్త్, ధర్పల్లి మండలాల్లో సరాసరి సగటు వర్షపాతం కంటే తక్కువగా పడింది. జిల్లాలోని నవీపేట్, నందిపేట్, ఏర్గట్ల, మెండోరా, ఎడపల్లి, రేంజల్, సాలూరా, డొంకేశ్వర్, ముప్కాల్, పోతంగల్ మండలాల్లో సరాసరి సగటు వర్షపాతం కంటే ఎక్కువగా వర్షం పడింది. జిల్లాలోని 17 మండలాల్లో సరాసరి సగటు వర్షపాతం నమోదైంది. బోధన్, బాల్కొండ, మోర్తాడ్, కమ్మర్‌పల్లి, కోటగిరి, వర్ని, చందూర్, భీంగల్, నిజామాబాద్ సౌత్, వేల్పూర్, ఇందల్వాయి, మాక్లూర్, డిచ్‌పల్లి, ఆలూర్, జక్రాన్‌పల్లి, నిజామాబాద్ రూరల్, మోస్రా మండలాల పరిధలో సరాసరి సగటు వర్షపాతం నమోదైంది. వాతావరణ శాస్త్రవేత్తల అంచనాల ప్రకారం మరో నాలుగు రోజుల పాటు ఓ మోస్తరు వర్షాల నుంచి భారీ వర్షాలు పడే అవకాశం ఉందని వారు తెలిపారు. రైతులు వర్షాలకు అనుగుణంగా పంటల సాగు కొనసాగించాలని కోరారు. ఆరుతడి పంటలకు అవసరమైన జాగ్రత్తలను తీసుకోవాలని వారు సూచించారు.

ఎస్సారెస్పీకి పెరుగుతున్న వరద..

జిల్లాలో పడుతున్న వర్షాలతో శ్రీరాంసాగర్ ప్రాజెక్టుకు క్రమేపీ వరద పెరుగుతోంది. జిల్లాతో పాటు ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న వర్షాల వల్ల ఈ వరద వస్తుంది. నాలుగు రోజులుగా పడుతున్న వర్షాలతో ప్రాజెక్టుకు గురువారం ఉదయం 6,539 క్యూసెక్కుల వరద రాగా సాయంత్రానికి అది 25,000 క్యూసెక్కులకు చేరింది. ఎగువ ప్రాంతాల్లో పడుతున్న వర్షాలతో ఈ వరద వచ్చి చేరుతోంది. ఈ వర్షాలు మరింత పెరిగితే వరద ఎక్కువగా వచ్చే అవకాశం ఉందని ఎస్సారెస్పీ అధికారులు అంచనా వేస్తున్నారు. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 1091 అడుగులకు గాను 1063.80 అడుగుల నీళ్లు చేరాయి. ప్రాజెక్టులో 80.5 టీఎంసీలకు గాను ప్రస్తుతం 14.545 టీఎంసీలకు నీళ్లు చేరాయి.

బీట్ ఆఫీసర్ల బదిలీల ప్రక్రియ పూర్తి

• 60 శాతం బదిలీల ప్రక్రియపై ఊహాగానాలు

సుభాష్‌నగర్, జూలై 18: అటవీశాఖలో బీట్ ఆఫీసర్ల బదిలీల ప్రక్రియ పూర్తయింది. మొత్తంగా 75 మంది బీట్ ఆఫీసర్లు ఉండగా వాటిలో 40 శాతం ఉన్నవారిని బదిలీల ప్రక్రియ చేపట్టారు. 30 మంది బీట్ ఆఫీసర్లకు ఈ బదిలీల్లో స్థానచలనం లభించింది. మొదటగా స్పౌజ్ విభాగంలో బదిలీలు చేపట్టారు. అనంతరం ఆరోగ్యపరమైన సమస్యలు ఉన్నవారికి బదిలీల్లో ప్రాధాన్యం ఇచ్చారు. అటవీశాఖలో ఇచ్చిన పాయింట్ల ఆధారంగా బదిలీల ప్రక్రియ చేపట్టారు. బదిలీ ప్రక్రియను ఇంచార్జి డీఎఫ్‌వో డి.వెంకటేశ్వర్‌రావు, ఎఫ్‌డీవో సుధాకర్‌రావు, ఆర్మూర్ ఎఫ్‌డీవో భవాని శంకర్, ఫ్లయింగ్ స్క్వాడ్ రవీందర్‌లు పాల్గొన్నారు. బదిలీల అనంతరం అటవీ శాఖ కార్యాలయ ఆవరణలో 60శాతం బదిలీ ప్రక్రియ చేపట్టనున్నట్లు గుసగుస లు వినిపించాయి. నేడో, రేపో 60శాతం బదిలీల ప్రక్రియ చేపట్టనున్నట్లు ఊహాగానాలు వినిపించడంతో ప్రస్తుతం అయిన బదిలీలు కొనసాగుతాయా లేదా అన్నది ప్రశ్నార్థకంగా మారింది.



నోటీసు బోర్డుపై పేర్లను చూసుకుంటున్న సిబ్బంది

డ్రగ్స్‌తో జీవితం నాశనం చేసుకోవద్దు : ఎస్సై

ముప్కాల్, జూలై 18 : విద్యార్థులు డ్రగ్స్ బారినపడి జీవితం నాశనం చేసుకోవద్దని బాల్కొండ ఎస్సై యాసిర్‌అర్ఫాత్ అన్నారు. గురువారం ప్రభుత్వజూనియర్ కళాశాలలో విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు చెడువ్యసనాలకు దూరంగా ఉండాలన్నారు. డ్రగ్స్‌కు బానిసై ఎందరో విద్యార్థుల జీవితాలు దుర్భరంగా మారాయన్నారు. వ్యసానాలకు బానిస కావద్దన్నారు. డ్రగ్స్ వాడితే కలిగే నష్టాల గురించి వివరించారు.

విద్యార్థులు చదువులో ఉన్నత శిఖరాలను అధిరోహించాలి

● ఆర్టీసీ రీజినల్ మేనేజర్ జానీరెడ్డి



విద్యార్థులనుద్దేశించి మాట్లాడుతున్న జానీరెడ్డి

మాక్లూర్, జూలై 18 : విద్యార్థులు క్రమశిక్షణ, పట్టుదలతో ముందుకు సాగి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆర్టీసీ రిజినల్ మేనేజర్ జానీ రెడ్డి అన్నారు. గురువారం విజయ్‌రూరల్ ఇంజనీరింగ్ కళాశాలలో పాల్‌టెక్నిక్ ఓరియంటల్ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డిప్లొమ చదివిన విద్యార్థులకు ఉన్నత అవకాశాలపై వివరించారు. అలాగే విద్యార్థులు ఈ వయస్సులో తీసుకోవాల్సిన జాగ్రత్త లను వివరించారు. కార్యక్రమంలో కళాశాల సిబ్బంది నరేందర్‌రెడ్డి, ప్రిన్సిపాల్ గణేష్, అధ్యాపకులు స్వప్న, శ్రీకాంత్, సంధ్య, తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌తోనే రైతులకు న్యాయం

● మాజీస్పీకర్, బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే పోచారం

బాన్సువాడ రూరల్, జూలై 18 : రైతులకు రుణమాఫీ చేయడం కాంగ్రెస్‌తోనే సాధ్యమైందని మాజీస్పీకర్, ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. గురువారం రైతులకు రుణమాఫీ కార్యక్రమంలో భాగంగా నిర్వహించిన సంబరాల కార్యక్రమంలో బాన్సువాడ దేశాయిపేట్ గ్రామాల్లో నిర్వహించిన ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్‌రెడ్డితో పాటు రాష్ట్ర అగ్రోచైర్మన్ కాసుల బాల్ రాజ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్‌రెడ్డి, రాహుల్ గాంధీ చిత్రపటాలకు పాలాభిషేకం చేపట్టారు. అనంతరం ఎమ్మెల్యే పోచారం మాట్లాడుతూ రేవంత్‌రెడ్డి నాయకత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వంతోనే ఇది సాధ్యమైందన్నారు. నలభై లక్షల మంది రైతులకు ముప్పైఒక వేల కోట్ల రూపాయలు, రెండు లక్షల రూపాయల వరకు ఒకేసారి అందించడం భార తదేశంలో ఇదే ప్రథమమన్నారు. ఇలాంటిది ఎప్పుడు జరగలేదన్నారు. అం దుకే సంబురాలు చేసుకుంటున్నామన్నారు. కాంగ్రెస్‌పార్టీ అధిష్ఠానం నిర్ణ యానికి అనుగుణంగా మన గౌరవ ముఖ్యమంత్రి మంత్రివర్గ సభ్యులు రుణమాఫీని అమలు చేస్తున్నారన్నారు. ముఖ్యమంత్రి అనుమతితో నిజాం సాగర్ ప్రాజెక్టు నుంచి పంటల సాగుకు నీరువిడుదల చేయించాం. రాష్ట్రంలో కేవలం నిజాంసాగర్‌ప్రాజెక్టు కింద మాత్రమే వరినాట్లు వేశా రు. ఒకవేళ నీళ్ళు తగ్గితే నేను అగ్రోస్ చైర్మన్ కాసుల బాల్‌రాజ్ ముఖ్య మంత్రి దగ్గరకు వెళ్లి కొండపోచమ్మ సాగర్ నుంచి నీటిని తెచ్చి పంటలను కాపాడుతాం. కాసుల బాల్‌రాజ్ రాష్ట్రస్థాయి పదవిలో ఉన్నారు. బయటి నుంచి వచ్చిన వారు కొన్నాళ్ళు ఉంటారు. తరువాత సర్దుకుని పోతారు. బాన్సువాడ నియోజకవర్గంలో రైతులకు, పేదలకు అండగా ఉండటానికి నేను బాలరాజు కలిసి పని చేస్తాం. బాన్సువాడ నియోజకవర్గానికి మంచి రోజులు వచ్చాయన్నారు. రుణమాఫీ అంశాన్ని ప్రతి కాంగ్రెస్ కార్యకర్త గ్రామస్థాయి నుంచి రాష్ట్రస్థాయి వరకు చర్చకు ప్రజల్లోకి తీసుకెళ్లాలని పిలుపునిచ్చారు. ఆగస్టు 15 నాటిని పూర్తిస్థాయి రుణమాఫీ ప్రక్రియ పూర్తి అవుతుందని స్పష్టం చేశారు. ఈ సందర్భంగా సీఎం, సోనియా, రాహుల్ గాంధీ చిత్రపటాలకు పాలాభిషేకం చేశారు.

వర్ని : ఒకేసారి రైతులకు రెండు లక్షల రుణమాఫీ చేయడం దేశ చరిత్రలోనే గొప్పచారిత్రక అంశమని బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్ రెడ్డి హర్షం వ్యక్తం చేశారు. కాంగ్రెస్ పార్టీ అగ్రనేతలు సోనియా గాంధీ, రాహుల్ గాంధీ, సీఎం రేవంత్ రెడ్డి ఎన్నికల్లో ఇచ్చిన వాగ్దానం మేరకు 29 రాష్ట్రాల్లో ఎక్కడా లేని విధంగా మన రాష్ట్రంలో సీఎం రేవంత్ రెడ్డి 41 లక్షల మందికి ఏకకాలంలో రుణమాఫీ చేసి రైతులను సంబరపర్చడం గర్వకారణంగా కొనియాడారు.

రుణమాఫీపై సంబరాలు



డొంకేశ్వర్‌లో ఎడ్లబండ్లపై ర్యాలీ నిర్వహిస్తున్న రైతులు

డొంకేశ్వర్, జూలై 18 : దేశంలో ఏ ప్రభుత్వం చేయని విధంగా కాంగ్రెస్ ప్రభుత్వం ఏకకాలంలో రూ.2 లక్షల రుణమాఫీ చేస్తుందని - తెలంగాణ రాష్ట్ర విత్త నాభివృద్ధి సంస్థ చైర్మన్ సుంకెట అన్వేష్‌రెడ్డి అన్నారు. గురువారం డొంకేశ్వర్ మండలంలోని రైతు వేదికలో నిర్వహించిన రైతు రుణమాఫీ కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చ్చిన మాట ప్రకారమే కాంగ్రెస్ ప్రభుత్వం రుణమాఫీ చేసిందని వివరించారు.

ఏర్గట్ల : రైతులకు రుణమాఫీ చేయడంతో మండలంలోని కర్షకులు, కాంగ్రెస్ నాయకులు హర్షం వ్యక్తం చేస్తూ గురువారం మండల కేంద్రంలోని బస్టాండ్ వద్ద సీఎం రేవంత్ రెడ్డి, బాల్కొండ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి ముత్యాల సునీల్‌కుమార్ చిత్ర పటాలకు క్షీరాభిషేకం చేశారు. కార్యక్రమంలో జిల్లా పార్టీ ఉపాధ్యక్షుడు శివన్నోల్ల శివకుమార్, మండల పార్టీ అధ్యక్షుడు సోమ దేవరెడి కార్యకర్తలు పాల్గొన్నారు.

నవీపేట : మండల కేంద్రంలో కాంగ్రెస్ నాయకులు సంబరాలు జరుపుకున్నారు. మండలంలోని జన్నెపల్లి రైతు వేదికలో గురువారం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రసంగాన్ని రైతులు వీడియో కాన్ఫరెన్స్‌లో వీక్షించారు. రైతులకు లక్ష రూపాయల రుణమాఫీ విడుదల చేయడం పట్ల వారు హర్షం వ్యక్తం చేశారు.

రెంజల్ : మండల కేంద్రంలోని రైతువేదికలో సీఎం ప్రసంగాన్ని మండల రైతులు, కాంగ్రెస్ నాయకులు వీక్షించారు. ఇచ్చిన మాట ప్రకారం లక్ష రూపాయల రుణమాఫీ మొదటి విడతలో చేయడం అభినందనీయమని మండల అధ్యక్షుడు మొబిన్ ఖాన్ అన్నారు. వీడియో కాన్ఫరెన్స్‌లో సీఎం ప్రసంగాన్ని వీక్షించారు. అనంతరం టపాకాయలు కాల్చి స్వీట్లు పంచుకున్నారు. బాగేపల్లిలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి చిత్రపటాలకు క్షీరాభిషేకం చేశారు.

మోర్తాడ్ : మండల కేంద్రంలో జాతీయరహదారి నుంచి దళితవాడకు ఊరేగింపుగా తరలివెళ్లారు. బాల్కొండ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జీ ముత్యాలసునీల్‌కుమార్ ఆధ్వర్యంలో భారీ ర్యాలీ నిర్వహించారు. తొలుత జాతీయరహదారిపై భారీ ఎత్తున టపాకాయలు పేల్చారు. అనంతరం రైతు వేదిక భవనం వద్ద సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి ముత్యాల సునీల్‌కుమార్ పాలాభిషేకం చేశారు.

ఆర్మూర్‌రూరల్ : ఆలూర్ మండల కేంద్రంలో రైతులు గురువారం రుణమాఫీ సంబరాలు నిర్వహించారు. మొదటి రోజు రూ.లక్ష రుణమాఫీ చేయడం పట్ల హర్షం వ్యక్తం చేస్తూ టపాకాయలు కాల్చి స్వీట్లు పంచుకున్నారు. అనంతరం సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి రైతులు పాలాభిషేకం చేశారు.

వేల్పూర్ : ప్రతీ రైతుకు రూ.2 లక్షల లోపు రుణమాఫీ చేయడం చారిత్రాత్మక నిర్ణయమని డీసీసీబీ చైర్మన్ కుంట రమేష్‌రెడ్డి అన్నారు. గురువారం వేల్పూర్‌లోని రైతువేదికలో ఏర్పాటు చేసి రుణమాఫీ సంబరాల్లో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు.

మోస్రా : మండల కేంద్రంలోని రైతువేదికలో ఏర్పాటు చేసిన ముఖ్యమంత్రితో ముఖాముఖి కార్యక్రమంలో రైతులు, అధికారులు పాల్గొని కార్యక్రమాన్ని వీక్షించారు. రైతురుణమాఫీపై వర్ని మండలంలోని వీఎంఆర్ ఫంక్షన్‌హాల్‌లో మాజీ ఎమ్మెల్యే ఏనుగు రవీందర్ రెడ్డి ఏర్పాటు చేసిన సంబరాలు కార్యక్రమంలో పాల్గొనడానికి మోస్రా మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు బయలుదేరారు.

కోటగిరి : కోటగిరి, పొతంగల్ మండల కేంద్రాల్లో గురువారం రైతు రుణమాఫీ అమలు చేయడాన్ని స్వాగతిస్తూ సీఎం రేవంత్ రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులకు ఇచ్చిన హామీని సీఎం రేవంత్ రెడ్డి నెరవేర్చారని కొనియాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకే తొలి ప్రాధాన్యత ఇస్తుందని గుర్తు చేశారు.

డిచ్‌పల్లి : ఎన్నికల్లో ఇచ్చిన హామీలను 6నెలల్లో నేరవేర్చిన ఘనత సీఎం రేవంత్‌రెడ్డికే దక్కుతుందని గత ప్రభుత్వం చేసిన కోట్లాది రూపాయల అప్పులు అధిగమించి రాష్ట్రంలో ఏకకాలంలో రైతు రుణమాఫీ చేసిన ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానికే దక్కిందని మం డల కాంగ్రెస్ అధ్యక్షుడు అమృతాపూర్ గంగాధర్ అ న్నారు. మండలంలోని నడిపల్లి రైతు వేదిక వద్ద సీఎం రేవంత్, ఎమ్మెల్యే భూపతిరెడ్డి చిత్రపటాలకు పాలాభి షేకం చేసిన అనంతరం మాట్లాడారు.

నందిపేట : నిజామాబాద్ చౌరస్తాలోని వివేకానంద విగ్రహం నుంచి ఐలమ్మ, అంబేద్కర్ చౌరస్తాల మీదుగా కొత్తబస్టాండ్ వరకు ర్యాలీ నిర్వహించారు. రూ.లక్ష వరకు ఉన్న రుణాలు మాఫీ చేయడంతో సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం చేశారు.

పెర్కిట్ : ఆర్మూర్ పట్టణంలో కాంగ్రెస్ నాయకులు పెర్కిట్ నుంచి అంబేద్కర్‌చౌరస్తా వరకు బైక్ ర్యాలీ నిర్వహించిన అనంతరం పెద్ద ఎత్తున టపాకాయలు పేల్చి సంబరాలు జరుపుకున్నారు. అనంతరం ర్యాలీగా వెళ్ళి రైతు వేదిక భవనంలో సీఎం వీడియో కాన్ఫరెన్స్‌లో రైతులతో పాటు కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు. కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జీ పొద్దుటూరి వినయ్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ ఇచ్చిన హామీ ప్రకారం రైతు రుణమాఫీ చేశామని తెలిపారు.

వేల్పూర్ : ప్రతీ రైతుకు రూ.2 లక్షల లోపు రుణమాఫీచేయడం చారిత్రాత్మక నిర్ణయమని డీసీసీబీ చైర్మన్ కుంట రమేష్‌రెడ్డి అన్నారు. గురువారం వేల్పూర్‌లోని రైతు వేదికలో ఏర్పాటు చేసి రుణమాఫీ సంబరాల్లో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు సీఎం రేవంత్‌రెడ్డి ఇచ్చిన హామీ మేరకు రైతులకు రుణమాఫీ చేసే కార్యక్రమాన్ని ప్రారంభించారన్నారు.

ఎడపల్లి : మండల కేంద్రంలోని అంబేద్కర్ విగ్రహం వద్ద గురువారం ఎడపల్లి రైతులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి చిత్ర పటాలకు క్షీరాభిషేకం చేసి ఒకరినొకరు మిఠాయిలు పంచుకున్నారు.

రుద్రూరు : మాజీ డీసీసీబీ చైర్మన్ పోచారం భాస్కర్‌రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఇచ్చిన మాట ప్రకారం రైతులకు రెండు లక్షల రుణమాఫీలో భాగంగా మొదటి విడతగా లక్ష రూపాయల రుణమాఫీ చేసిన శుభ సందర్భంగా సీఎం రేవంత్‌రెడ్డి చిత్ర పటానికి పాలాభిషేకం చేశారు.

జక్రాన్‌పల్లి : జక్రాన్‌పల్లి, అర్గుల్, పడకల్, కలిగోట్ గ్రామాల్లో రైతువేదికలో సీఎం రేవంత్‌రెడ్డి, నిజామాబాద్‌రూరల్ ఎమ్మెల్యే డాక్టర్ భూపతిరెడ్డి చిత్రపటాలకు పాలాభిషేకం చేశారు.

కమ్మర్‌పల్లి : మండలంలో 1270 మంది రైతులకు రుణమాఫీ వర్తించినట్లు వ్యవసాయధికారి అబ్దుల్ మలిక్ తెలిపారు. రైతు వేదికలో వీడియో కాన్ఫరెన్స్‌లో రైతులతో కలిసి సీఎం సందేశాన్ని వీక్షించారు.

ముప్కాల్ : ముప్కాల్, బాల్కొండ మండల కేంద్రంలోని రైతు వేదికలో సీఎం రేవంత్‌రెడ్డి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ప్రారంభించడంతో కాంగ్రెస్ శ్రేణులు, రైతులు సంబరాలు నిర్వహించారు.

వేతనాలు చెల్లించాలని ధర్నా



నిరసన తెలుపుతున్న లిఫ్టు కార్మికులు

నవీపేట, జూలై 18 : జిల్లాలోని అలీసాగర్, గుత్ప ఎత్తిపోతల పథకంలో పనిచేస్తున్న తమకు నాలుగు మాసాలుగా వేతనాలు చెల్లించడం లేదని, వెంటనే పెండింగ్‌లో ఉన్న వేతనాలను చెల్లించాలని కోరుతూ గురువారం మండల కేంద్రంలో కార్మికులు ధర్నా నిర్వహించారు. అలీసాగర్, గుత్పఎత్తిపోతల పథకంలో తాము ఎలక్ట్రీషియన్, పంప్‌ఆపరేటర్, వాచ్‌మెన్, తదితర పనులను సుమారు 120 మంది వరకు చేపడుతున్నామని అన్నారు. నాలుగు మాసాలుగా సంబంధిత కాంట్రాక్టర్ వేతనాలు చెల్లించకపోవడంతో తాము తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని వారు తమ ఆవేదన వ్యక్తం చేశారు. వెంటనే పెండింగ్ వేతనాలు చెల్లించాలని కోరుతూ ప్రధాన చౌరస్తా వద్ద నిరసన తెలిపి, మండల రెవెన్యూ కార్యాలయం వద్ద ధర్నా చేశారు. అనంతరం తహసీల్దార్ నారాయణకు వినతిపత్రం సమర్పించారు. కార్యక్రమంలో గణేష్, కార్తీక్, సందీప్, జగదీష్, తదితరులు పాల్గొన్నారు.

కుర్నాపల్లిలో ట్రాన్స్‌ఫార్మర్ ధ్వంసం



దుండగులు ధ్వంసం చేసిన ట్రాన్స్‌ఫార్మర్

ఎడపల్లి, జూలై 18 : కుర్నాపల్లి గ్రామ శివారు పంటపొలంలో ఉన్న రెండు ట్రాన్స్‌ఫార్మర్లను బుధవారం రాత్రి దుండగులు ధ్వంసం చేసి, అందులో ఉన్న రాగి వైరు కాయిల్స్‌ను ఎత్తుకెళ్లారని రైతులు తెలిపారు. గతంలో కూడా ఇదే ఏరియాలో ధ్వంసం చేశారన్నారు. కొందరు కావాలనే ట్రాన్స్‌ఫార్మర్లను ధ్వంసం చేస్తూ అందులోని రాగివైరును ఎత్తుకెళ్ళి పంట పొలాలకు నష్టం కలుగజేస్తున్నారని వారు వాపోయారు. పోలీసులు వెంటనే స్పందించి ట్రాన్స్‌ఫార్మర్లు ధ్వంసం కాకుండా చూడాలని రైతులు కోరుతున్నారు.

వర్సిటీ అధ్యాపకుల రిటైర్‌మెంట్ వయస్సు 65కు పెంచాలి

డిచ్‌పల్లి, జూలై 18 : దశాబ్దకాలం పాటు ప్రభుత్వరంగ విద్యాసంసల పట్ల నిర్లక్ష్యం చేస్తూ ఉన్నత విద్యను నిర్వీర్యం చేశారని తెలంగాణ యూనివర్సిటీ టూటా అధ్యక్షుడు డా.పున్నయ్య పేర్కొన్నారు. గురువారం వర్సిటీలో జరిగిన సమావేశంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఆయన మాట్లాడుతూ.. మానవవనరుల అభివృద్ధి రాష్ట్ర అభివృద్ధిలో కీలకంగా ఉంటుందన్నారు. ఈ ప్రభుత్వం ఉన్నత విద్యారంగంలో పనిచేస్తున్న అధ్యాపకులకు యూనివర్సిటీ గ్రాంట్ కమిషన్ నిబంధనల మేరకు పదవి విరమణ 65ఏళ్లకు పెంచాలని వర్సిటీలోని ఖాళీఉద్యోగాలను భర్తీ చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

అలీసాగర్ లిఫ్టులో పాములు



పంప్‌లో బయటపడ్డ రక్తపింజరాలు

నవీపేట, జూలై 18 : మండలంలోని కోస్లీలో గల అలీసాగర్ ఎత్తిపోతల పథకం స్టేజీ-1 పంప్ హౌస్‌లో ఒకేరోజు 20 రక్త పింజర పాములు బయట పడినట్లు ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. కార్మికులు తెలిపిన ప్రకారం ఈ నెల 11న ఉదయం నుంచి సాయంత్రం వరకు సుమారు 20 రక్త పింజరాలు బయటపడ్డాయని, ఇందులో కొన్నింటిని తాము చంపి వేయగా మరికొన్ని బయటకు పారిపోయాయని వారు పేర్కొన్నారు. కొన్నిసార్లు మిషనరీకి చెందిన సందులలో నక్కి ఉంటున్నాయని, తాము అప్రమత్తంగా లేకపోతే వాటి కాటుకు గురికావాల్సిన ప్రమాదం ఉంటుందని వారు ఆవేదన వ్యక్తం చేశారు. కార్మికులుగా పనిచేస్తున్న తమకు గత కొన్ని సంవత్సరాలుగా రక్షణ పరికరాలు ఇవ్వడం లేదని వారు ఆవేదన వ్యక్తం చేశారు. ఉన్నతాధికారులు స్పందించి తమ రక్షణకు బూట్లు, చేతి గ్లౌసులు, టోపీలు అందించాలని కోరుతున్నారు.

డిగ్రీ ఫలితాలు విడుదల

డిచ్‌పల్లి, జూలై 18 : తెలంగాణ విశ్వవిద్యాలయం పరిధిలోని 2021-24 సంవత్సరం డిగ్రీఫలితాలు విడుదల చేశారు. వర్సిటీ వీసీ సందీప్ కుమార్ సుల్తానియ ఆదేశాల మేరకు రిజిస్ట్రార్ యాదగిరి తన చాంబర్‌లో కంట్రోలర్ అరుణతో కలిసి ఫలితాలు విడుదల చేశారు. 8930 మంది విద్యార్థులు పరీక్షలు రాయగా 3966 ఉత్తీర్ణులు అయ్యారు. 44.41శాతం ఉత్తీర్ణులు అయ్యారని, ఇందులో బాలురు 27.93శాతం, బాలికలు 55.66 శాతం ఉత్తీర్ణత సాధించారని సీవోఈ అరుణ తెలిపారు. విడుదల కార్యక్రమంలో ఆడిట్ సెల్ డైరెక్టర్ ఘంట చంద్రశేఖర్, సాయిలు, డా.నం దిని, డా.శాంతబాయి, పీఆర్వో పున్నయ్య, ప్రోగ్రామర్‌లు సతీశ్, విజయ్, సందీప్ పాల్గొన్నారు. డిగ్రీ బ్యాక్‌లాగ్ వన్‌టైం పరీక్షలు గురువారం 16వరోజు ప్రశాంతంగా జరిగినట్లు ఆడిట్ సెల్ డైరెక్టర్ ప్రొ.ఘంట చంద్రశేఖర్ తెలిపారు. తొమ్మిది మంది గైర్హాజరయ్యారని చంద్రశేఖర్ తెలిపారు.

ఉత్తీర్ణతా శాతం పెంచండి : బోధన్ ఎమ్మెల్యే



చెక్కులను అందిస్తున్న ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి

ఎడపల్లి, జూలై 18 : మండలంలో ఉన్న అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో ఉత్తీర్ణత శాతం 75కు పైగా రావాలని మాజీమంత్రి, బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి అన్నారు. ఎడపల్లి మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయంలో గురువారం 41 మంది లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులను ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి అందించారు. ఆ తరువాత మండలంలో ఉన్న అన్ని ప్రభుత్వ పాఠశాలల ప్రధానోపాధ్యాయులతో ఆయన సమీక్షా సమావేశం నిర్వహించి పాఠశాలలో ఉన్న సమస్యలు, విద్యార్థులు, ఉపాధ్యాయుల వివ రాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల శాతం పెంచాలని, అలాగే విద్యార్థుల ఉత్తీర్ణత శాతం ప్రతీ సబ్జెక్టులో 75కు పైగా వచ్చేలా చూడాల్సిన బాధ్యత పాఠశాలల ప్రధానోపాధ్యాయులదేనన్నారు. కార్యక్రమంలో తెలంగాణ ఉర్దూ అకాడమీ చైర్మన్ తాహెర్ బీన్ హందాన్, బోధన్ ఆర్డీవో అంబాదాస్ రాజేశ్వర్, తహసీల్దార్ ధన్వాల్, ఎంపీడీవో శంకర్‌నాయక్, నాయకులు శంకర్‌నాయుడు, పులిశ్రీనివాస్, బిల్లా రాంమోహన్, రజితాయాదవ్, ఎల్లయ్య యాద వ్, బంజకామప్ప, అమానుల్లా, ఖాజా, గంగాప్రసాద్, నారాయణ, రవీందర్‌రెడ్డి, కంచరి శ్రీనివాస్, బొబ్బిలి శ్రీనివాస్ ఉన్నారు.

ఆడపడుచులకు అండగా రాష్ట్ర ప్రభుత్వం

బోధన్‌రూరల్ : కాంగ్రెస్ పార్టీ ఎన్నికల్లో ఇచ్చిన హామీ ప్రకారం రైతులకు రెండు లక్షల రుణమాఫీ చేసి దేశ చరిత్రలో నిలిచిపోయిందని బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి అన్నారు. గత ప్రభుత్వం నిర్లక్ష్యం చేసి ఖాజానాను ఖాళీ చేశాయని మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌పై మండిపడ్డారు. బోధన్ పట్టణంలోని అప్నా ఫంక్షన్‌హాల్‌లో కల్యాణ లక్ష్మి, షాదీముబారక్ చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మహిళలను ఉద్దేశించి మాట్లాడుతూ బోధన్ నియోకవర్గంలో 500మంది లబ్దిదారులకు కల్యాణ లక్ష్మి, షాదీముబారక్ చెక్కులను అందజేయడం జరిగిందన్నారు. కార్యక్రమంలో ఉర్దూ అకాడమీ చైర్మన్ తాహెర్‌బిన్ హందాన్, మున్సిపల్ చైర్‌పర్సన్ తూము పద్మ శరత్ రెడ్డి, టీపీసీసీ డెలిగేట్ గంగాశంకర్; కాంగ్రెస్ పార్టీ నాయకులు పాషామొయినోద్దీన్, ఆదినారాయణ, బిళ్ల రామ్మోహన్, పులిశ్రీనివాస్, నాగేశ్వర్ రావు, మందర్నా రవి, కాంగ్రెస్ పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

డంపింగ్ యార్డును వాడుకలోకి తెస్తాం : ఎస్‌బీఎం డైరెక్టర్



మొక్కలు నాటిన ఎస్‌బీఎం డైరెక్టర్ సురేష్ బాబు

ఎడపల్లి, జూలై 18 : తెలంగాణ రాష్ట్రంలోనే నిజామాబాద్ జిల్లా ఎడపల్లి మండల కేంద్రంలో సుమారు కోటి రూపాయల వరకు విలువ చేసే మోడ్రన్ డంపింగ్ యార్డును త్వరలో వాడుకలోకి తెస్తామని స్వచ్ఛ భారత్‌మిషన్ డైరెక్టర్ సురేష్‌బాబు తెలిపారు. ఎడపల్లి మండల కేంద్రంలో రూర్బన్ పథకంలో భాగంగా నిర్మించిన మాడ్రన్ డంపింగ్ యార్డును గురువారం జిల్లా పంచాయతీ అధికారి తరుణ్ కుమార్‌తో కలిసి ఆయన పరిశీలించి డంపింగ్ యార్డు అవరణలో మొక్కలు నాటారు. అనంతరం మాడ్రన్ డంపింగ్ యార్డులో ఏర్పాటు చేసిన ప్లాస్టిక్ ప్రెస్సింగ్ యంత్రాల పనితీరును ఆయన పరిశీలించి, యంత్రాలలో ఏమైనా సమస్యలుంటే వాటిని వెంటనే సరిచేయాలని అధికారులకు సూచించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మొదటగా ఎడపల్లి మండలంలోని గ్రామాలలోని ప్లాస్టిక్‌ను మోడ్రన్ డంపింగ్ యార్డుకు తరలించేలా చర్యలు చేపడతామని, ఆ తరువాత రెంజల్, నవీపేట, బోధన్ మండలాల ప్లాస్టిక్ వ్యర్థాలను మోడ్రన్ డంపింగ్ యార్డుకు తరలించే విధంగా అనుసంధానం చేస్తామని ఆయన అన్నారు. కార్యక్రమంలో జిల్లా పంచాయతీ అధికారి తరుణ్‌కుమార్, డీఎల్‌పీఓ సాయిబాబా, ఎంపీడీవో శంకర్‌నాయక్, ఎంపీవో రవిప్రకాష్ రెడ్డి, ఉపాధిహామీ ఏపీవో శ్రీవాణీ, ఐకేపీ ఏపీఎం సాయిలు, ఎడపల్లి పంచాయతీ కార్యదర్శి నాగరాజు గౌడ్, ఉపాధి హామీ క్షేత్ర సహాయకురాలు సుచరిత తదితరులు ఉన్నారు.

అక్రమ కోకాల తొలగింపు



కోకాలను తొలగిస్తున్న సిబ్బంది

బోధన్ రూరల్, జూలై 18 : బోధన్ ఆర్టీసీ డిపో ప్రాంగణంలో ఉన్న అక్రమ కోకాలను గురువారం తెల్లవారుజామున ఆర్టీసీ విజిలెన్స్ అధికారులు తొలగించారు. జేసీబీతో అక్రమ కోకాలను తీసివేశారు. ఈ సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా పోలీసు బందోబస్తు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్టీసీ విజిలెన్స్ సీఐ జనార్ధన్ మాట్లాడుతూ బోధన్ ఆర్టీసీ స్థలం అక్రమించిన వారికి కోర్టు నోటీసులు పంపించామని, అయినా వినకపోవడంతో కోర్టు ఆదేశాలతో చట్టప్రకారమే తొలగించామన్నారు. 20 సంవత్సరాలుగా కోకాలు వేసుకుని తీయకపోవడంతో కోర్టు, ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు కోకాను తీసివేయడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో బోధన్ ఆర్టీసీ డీఎం శ్రీనివాస్, సిబ్బంది తదితరులున్నారు.

ప్రకాశ్‌కు డాక్టరేట్ ప్రదానం

డిచ్‌పల్లి, జూలై 18: తెలంగాణ విశ్వవిద్యాలయం పరిధిలో హిందీ విభాగంలో ప్రకాశ్‌కు డాక్టరేట్ వచ్చింది. రిటైర్డ్ అసోసియేట్ ప్రొఫెసర్ డా.ప్రవీణాబాయి పర్యవేక్షణలో శతృఘ్నుకుమార్ విశ్లేషణాత్మక అధ్యాయన్ అనే అంశం పై పరిశోధన జరిపారు. గురువారం జరిగిన మౌలికపరీక్షకు ఎక్స్‌టర్నల్ ఎక్సామినర్‌గా (ఇఫ్లూ యూనివర్సిటీ) శ్యాంరావు రాథోడ్ హాజరయ్యారు. ఈ సందర్భంగా పరిధోధకుడు ప్రకాశ్‌ను ఆయన పలుప్రశ్నలు అడిగి సమాధానలు రాబట్టారు. పరిశోధక విద్యార్థికి డాక్టరేట్ పట్టా ప్రకటించి అందజేశారు.

టీయూలో విద్యార్థినులకు పోటీలు

డిచ్‌పల్లి,జూలై 18 : తెలంగాణ విశ్వవిద్యాలయం బిజినెస్ మేనేజ్‌మెంట్ విభాగంలో మెహిందీ, హెయిర్‌స్టైల్ పోటీలు గురువారం నిర్వహించారు. ఈ పోటీల్లో 40 మంది విద్యార్థినులు నైపుణ్యాన్ని ప్రదర్శించారు. ఈ ఈవెంట్‌లను ప్రొ.అంజనేయులు పర్యవేక్షించారు. పోటీల్లో జాదవ్ తేజకుమారీ, మాలవత్ లక్ష్మీ, మేఘశ్రీ, మేనేజర్‌గా వ్యవహరించారు. పోటీల్లో ప్రథమ బహుమతి సృజన, ఇస్రత్ నాజ్ జ్యోతియ బహుమతులు అందుకున్నారు. మెహిందీ పోటీల్లో శ్వేత, ప్రథమ, లావణ్యా సెకండ్, భాగ్యశ్రీ మూడోబహుమతి అందుకున్నారు. అధ్యాపకులు రాజేశ్వరి, శ్రీనివాస్, పాల్గొన్నారు.

ఇంటిగ్రేటెడ్ పీజీ సెమిస్టర్ పరీక్షల్లో 10మంది గైర్హాజర్

డిచ్‌పల్లి,జూలై 18: విశ్వవిద్యాలయం పరిధిలోని పీజీ ఇంటిగ్రేటెడ్ ఏపీఈ, ఐపీసీహెచ్, ఐఎంబీఏ 6,8,10వ సెమిస్టర్, ఎల్ఎల్‌బీ 6, ఎంబీఏ,ఎంసీఏ 1,3వ సెమిస్టర్, ఐఎంబీఏ 7,9 వసెమిస్టర్ రెగ్యూలర్, బ్యాక్‌లగ్ పరీక్షలు గురువారం ప్రశాంతంగా జరిగాయని ప్రిన్సిపాల్ ప్రొ.హారతి, వైస్ ప్రిన్సిపాల్ సత్యనారాయణలు తెలిపారు.

ఆర్మూర్‌లో ఆశావర్కర్ల ధర్నా



కార్యాలయంలో వినతిపత్రం అందజేస్తున్న ఆశవర్కర్‌లు

ఆర్మూర్‌టౌన్, జూలై 18: పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో సీఐటీయు ఆధ్వర్యంలో గురువారం ఆశవర్కర్‌లు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐటీయు మండల కన్వీనర్ కుతాడి ఎల్లయ్య మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఆశవర్కర్‌లకు రూ.18వేల వేతనం అందించాలని, పీఎఫ్, ఈఎస్ఐ, ప్రమాణబీమా, రిటైర్‌మెంట్ బెనిఫిట్‌లను కల్పించాలని లేకుంటే సెప్టెంబర్ 25నుంచి అక్టోబర్ 9వ తేదీ వరకు రాష్ట్ర వ్యాప్తంగా ఆశవర్కర్‌లు సమ్మె చేస్తారని ఆయన తెలిపారు. అనంతరం ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. ఆశవర్కర్‌ల ధర్నాకు రైతు సంఘం జిల్లా కార్యదర్శి పల్లపు వెంకటేష్ సంఘీభావం ప్రకటించారు. ఈ కార్యక్రమంలో ఆశవర్కర్‌లు సలీమ, బాగ్య, వనిత, జ్యోతి, అనిత, స్వప్న, మమత, సరోజ, లాస్య తదితరులు పాల్గొన్నారు.

పీఆర్టీయూతోనే ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారం

ఏర్గట్ల, జులై 18 : ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారం పీఆర్టీయూతోనే సాధ్యమని పీఆర్టీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కమలాకర్‌రావ్ అన్నారు. గురువారం మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పీఆర్టీయూ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇప్పటివరకు ఉపాధ్యాయుల సమస్యలను ఒక పీఆర్టీయూ సాధించినవేనని తెలిపారు. కార్యక్రమంలో ఏర్గట్ల పీఆర్టీయూ జిల్లా అధ్యక్షుడు మోహన్‌రెడ్డి, ఆర్మూర్ డివిజన్ ఇన్‌చార్జి లక్ష్మణ్ పటేల్, మండల ప్రధాన కార్యదర్శి కృష్ణప్రసాద్, మాజీ అధ్యక్షుడు శేర్ల శ్రీనివాస్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రాయల చంద్రశేఖర్ సంతాప సభ

నందిపేట, జులై 18 : మండల కేంద్రంలో గురువారం సీపీఐ(ఎంఎల్) మాస్‌లైన్ ప్రజాపంథ రాష్ట్ర కమిటీ నాయకులు, తెలంగాణ రాష్ట్ర అఖిల భారత ప్రగతి శీల రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షులు కామ్రేడ్ రాయల చంద్రశేఖర్ సంతాప సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. సీపీఐ(ఎంఎల్) మాస్‌లైన్ కేంద్ర కంట్రోల్ కమిషన్ చెర్మన్‌గా, సభ్యులుగా సుదీర్ఘకాలం పనిచేసినట్లు వక్తలు వివరించారు. విప్లవోద్యమ నిర్మాణం కోసం రాయల చంద్రశేఖర్ బహిరంగంగాను, రహస్యంగాను అనేక పనులు చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో సీపీఐ(ఎంఎల్) నాయకులు కె గంగాధర్, భూమన్న, రఫీక్, సలీమ్, సతీష్, నాగేష్ తదితరులు ఉన్నారు.

బోధన్‌రూరల్ : పేద ప్రజల కోసం నిరంతరం పోరాటం చేసిన కామ్రేడ్ రాయల చంద్రశేఖర్ సేవలు మరువలేనివని సీపీఐ ఎంఎల్ నాయకులు మల్లేష్ అన్నారు. గురువారం బోధన్ పట్టణంలో కామ్రేడ్ రాయల చంద్రశేఖర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. నిమిషం పాటు మౌనం పాటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మూడురోజుల క్రితం రాష్ట్ర కమిటీ సమావేశానికి హాజరై ఇంటికి వెళ్తున్న సమయంలో రాయల చంద్రశేఖర్ ప్రమాదవశాత్తు రైలు కింద పడి మృతి చెందాడని పేర్కొన్నారు. ఆయన మరణం పార్టీకి ఎంతో తీరని లోటని పేర్కొన్నారు.

సంఘ భవన నిర్మాణానికి రూ.లక్షా 5వేల విరాళం

పెర్కిట్, జూలై 18 : మున్సిపల్ పరిధిలోని పద్మశాలి 2వ తర్ప సంఘ భవనానికి రూ.లక్ష 5111లను యుఎస్‌ఏ డల్లాస్‌కు చెందిన దాసరి నిర్మల రాధాకిషన్ కుమారుడు దాసరి ఉదయ్‌కిరణ్ విరాళంగా అందజేశారు. ఈ సందర్భంగా సంఘ అధ్యక్షుడు మెరుగు శ్రీనివాస్, కార్యదర్శి అంబల్ల వివేకానంద ఆధ్వర్యంలో గురువారం వారిని పూలమాల, శాలువతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో పద్మశాలి సంఘం సభ్యులు ఏడెల్లి శ్రీనివాస్, సుధాకర్, కన్నెపల్లి రాజన్న, లిప్టి అమర్, గుడ్ల దశరథ్, దేవయ్య, తాటిపాపల శ్రీనివాస్, బోగ రమణ, బండి రమేష్, బూస బాబు, సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేకు వినతిపత్రం ఇచ్చిన 61 వీఆర్ఏ వారసులు

ఎడపల్లి, జూలై 18 : మండల కేంద్రంలో కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ చెక్కుల పంపిణీ కార్యక్రమానికి వచ్చిన బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డికి గురువారం 61 వీఆర్ఏల వారసులు తమకు ఉద్యోగ అవకాశం కల్పించాలని కోరారు. అలాగే జీ.ఓ.నం. 81ను అమలు చేయాలని ఆయనతో కోరగా, స్పందించిన ఆయన ముఖ్యమంత్రితో మాట్లాడి సమస్య పరిష్కారం అయ్యేలా చూస్తానని వారికి హామీ ఇచ్చారు. వినతిపత్రం అందించిన వారిలో 61 వీఆర్ఏల వారసులు కరుణాకర్, రాజు, బాలు, మోహన్, రత్నాకర్, అవి నాష్, మహేందర్ తదితరులున్నారు.

గల్ఫ్ వెళ్లిన రైతులకు రుణమాఫీ అమలు చేయాలి

నవీపేట, జూలై 18 : ఉపాధి నిమిత్తం గల్ఫ్ వెళ్లిన రైతులకు సైతం రుణమాఫీని అమలు చేయాలని మాజీ జడ్పీటీసీ కే.సాయిబాబా గౌడ్ కోరారు. గురువారం ఆయన నవీపేటలో మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం రైతులకు ఏకకాలంలో 2 లక్షల రూపాయల రుణమాఫీని అమలు చేయడం పట్ల ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డికి ప్రత్యేక ధన్యవాదాలు తెలుపుతున్నామన్నారు. ఇదే సమయంలో కొన్ని చోట్ల గల్ఫ్ వెళ్లిన రైతుల పేర్లు రేషన్‌కార్డులలో లేవని, ఇటువంటి రైతులను నోడల్ అధికారులు ప్రత్యేకంగా గుర్తించి వారికి రుణమాఫీ అమలు చేసే విధంగా చూడాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

షరతులు లేకుండా రుణమాఫీ చేయాలి

ఆర్మూర్‌రూరల్, జూలై 18 : పంట రుణం తీసుకున్న ప్రతీ రైతుకు షరతులు లేకుండా రూ.2 లక్షల రుణమాఫీ చేయాలని బీఆర్ఎస్ నాయకులు డిమాండ్ చేశారు. గురువారం ఆర్మూర్ పట్టణంలో విలేకరుల సమావేశంలో మార్కెట్ కమిటీ మాజీవైస్‌చైర్మన్ ఇట్టెడి లింగారెడ్డి, మాక్లూర్ మాజీ వైస్‌ఎంపీపీ సుక్కిసుధాకర్, ఇ.గంగాధర్, సీనియర్ నాయకులు పోల సుధాకర్, పట్టణ అధ్యక్షుడు పూజ నరేందర్ మాట్లాడుతూ చిన్న, సన్న కారు రైతులు మాత్రం ఐటీ రిటర్న్ దాఖలు చేసినందున వారికి రుణమాఫీ వర్తించడం లేదన్నారు. ఎన్నికల సమయంలో రేవంత్‌రెడ్డి ఇచ్చిన హామీ మేరకు రుణమాఫీ చేయాలన్నారు. అధికారం చేపట్టక మాటమార్చి అనేక షరతులు పెట్టి రైతులను ఇబ్బందులకు గురి చేయడం సమంజసం కాదన్నారు. చిన్న, సన్నకారు రైతులకు తెల్లరేషన్ కార్డు ఉంటుందని, వివిధ కారణాల వల్ల కార్డు లేని వారికి రుణమాఫీ జరగడం లేదన్నారు. పట్టాపాస్‌పుస్తకం ఆధారంగా రుణాలు తీసుకున్న ప్రతీ ఒక్కరికి మాఫీ చేయాలని వారు కోరారు.

జాగ్రత్తలు పాటిస్తే రోడ్డు ప్రమాదాలు నివారించవచ్చు

● ఎంవీఐ వివేకానందరెడ్డి

ఆర్మూర్ రూరల్, జూలై 18 : మానవ తప్పిదాల వల్లే రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయని ప్రతీఒక్కరు జాగ్రత్తలు పాటిస్తే రోడ్డు ప్రమాదాలను నివారించవచ్చని ఆర్మూర్ ఎంవీఐ వివేకానందరెడ్డి అన్నారు. గురువారం ఆర్మూర్ పట్టణంలో వాహనదారులకు రోడ్డు ప్రమాదాల నివారణపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎంవీఐ వివేకానందరెడ్డి మాట్లాడుతూ ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, కారులో ప్రయాణం చేసేవారు సీట్‌బెల్ట్ తప్పక ధరించాలన్నారు. చిన్నపాటి నిర్లక్ష్యానికి విలువైన ప్రాణాలు గాలిలో కలిసిపోతున్నాయన్నారు. రోడ్డు ప్రమాదాలు జరిగినప్పుడు అధిక శాతం ద్విచక్ర వాహనదారులు తలకు తీవ్రగాయాలై మృతిచెందుతున్నట్టు అధ్యాయనంలో వెల్లడైందని, ప్రతీ ఒక్కరు హెల్మెట్ ధరిస్తే కొంత వరకైనా కాపాడుకోవచ్చని సూచించా రు. ఇటీవల జిల్లాలో జరిగిన పలు ప్రమాదాల్లో హెల్మెట్ ధరించకపోవడం వల్లనే వాహనదారులు మృతిచెందినట్లుగా తాము గుర్తించామన్నారు. ప్రతీ ఒక్కరు రోడ్డు నిబంధనలు పాటించి తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో సుంకె శ్రీనివాస్, వాహనదారులు పాల్గొన్నారు.

పొతంగల్‌లో ఇసుక ట్రాక్టర్ పట్టివేత

కోటగిరి, జూలై 18 : పొతంగల్ మండలంలో ఇసుకను అక్రమంగా తరలిస్తున్న ట్రాక్టర్‌ను పట్టుకున్నట్లు ఎస్ఐ సందీప్ తెలిపారు. బుధవారం రాత్రి ఇసుకను అక్రమంగా తరలిస్తుండగా పట్టుకున్నట్లు ఆయన తెలిపారు. అనుమతి లేకుండా ఇసుక రవాణా చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

యువత మత్తుపదార్థాలకు దూరంగా ఉండాలి

మోర్తాడ్, జూలై 18 : యువకులు, విద్యార్థులు గంజాయి మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని ఎస్సై అనిల్‌రెడ్డి అన్నారు. గురువారం మండలకేంద్రంలోని ప్రైవేటు పాఠశాలలో గంజాయి ఇతర మత్తుపదార్థాల నిర్మూలనపై అవగాహన కల్పించారు. ఎస్సై మాట్లాడుతూ యువకులు, విద్యార్థులు మత్తుపదార్థాలకు బానిసలుగా మారి తమ బంగారు భవిష్యత్‌ను నాశనం చేసుకోవద్దన్నారు. గంజాయి, మత్తుపదార్థాలు విక్రయించిన, సేవించిన కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో పోలీసులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కోటగిరి: పొతంగల్ మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ పాఠశాలలో గురువారం మత్తు పదార్థాల నియంత్రణపై అవగాహన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఎస్ఐ సందీప్ మాట్లాడుతూ గంజాయి, డ్రగ్స్‌లాంటి మత్తు పదార్థాల వల్ల భవిష్యత్ అంధకారం అవుతుందని పేర్కొన్నారు. వాటి వల్ల కలిగే నష్టాలను వివరించారు. విద్యార్థులు కష్టపడి చదువుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఏఎస్ఐ శ్రీనివాస్ గౌడ్, ప్రధానోపాధ్యాయులు సాయిలు తదితరులు పాల్గొన్నారు.

జక్రాన్‌పల్లి : మత్తుపదార్థాలకు యువత దూరంగా ఉండాలని ఎస్సై సీహెచ్.తిరుపతి అన్నారు. గురువారం జక్రాన్‌పల్లిలోని ఆదర్శ పాఠశాల, కళాశాలలో నిజామాబాద్ పోలీస్ కమిషనర్ ఆదేశాల మేరకు డ్రగ్స్, గంజాయి, మత్తుపదార్థాలు నియంత్రణపై పోలీస్ కళాజాత నిర్వ హించా రు. నిజామాబాద్ పోలీసు కళాజాత బృందం సభ్యులు మత్తుపదార్థాలపై నాటికలు చేసి విద్యార్థులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఏఎస్సై సుశీల్‌కుమార్, ప్రిన్సిపాల్ రాజేశ్వర్‌రెడ్డి, పోలీస్ కళాజాత బృందం, పోలీస్‌సిబ్బంది పాల్గొన్నారు.

మత్తు పదార్థాలపై విద్యార్థులకు అవగాహన

మోపాల్, జూలై 18: విద్యార్థులు మత్తు పదార్థాలకు బానిసలు కావద్దని ఎస్సై గంగాధర్ విద్యార్థులకు సూచించారు. గురువారం మండలం కులాస్‌పూర్ ప్రభుత్వ ప్రాథమిక ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు పోలీసుల ఆధ్వర్యంలో యాంటి నార్కోటిక్ డ్రగ్స్ అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్సై గంగాధర్ మాట్లాడుతూ గంజాయి, హెరాయిన్, కొకెన్ లాంటి మత్తు పదార్థాలతో మానవాళికి జరిగే నష్టాలు, వాడకం, రవాణా, సాగు చేయడం వంటివి చేస్తే చట్టపరమైన శిక్షలు ఉంటాయని విద్యార్థులకు వివరించారు. ప్రధానోపాధ్యాయురాలు వనిత మాట్లాడుతూ.. యువతకు ఇలాంటి అవగాహన సదస్సులు ఎంతో మేలు చేస్తాయని తెలిపారు. ఏఎస్సై రమేష్ మాట్లాడుతూ.. విద్యాసంస్థల యాజమాన్యాలు కూడా తమ విద్యార్థులకు సరైన అవగాహన కల్పిస్తే వారికి ముందు తరాలకు సహాయం చేసినవారం అవుతామని అన్నారు. ఈ కార్యక్రమంలో విద్యాకమిటీ అధ్యక్షుడు మహేష్, గ్రామ కమిటీ అధ్యక్షుడు హుస్సేన్, ఉపాధ్యాయులు, పోలీసులు, విద్యార్థులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అవగాహన

పెద్దబజార్, జూలై 18: నగరంలోని కోటగల్లిలో గురువారం సీజనల్ వ్యాధులపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రతినిధి క్రాంతి కుమార్ మాట్లాడుతూ.. ఈ సీజన్‌లో దోమల బెడద ఎక్కువ ఉంటుందని అన్నారు. దోమల పేరులోనే కాదు కుట్టే విధానంలో కూడా విభిన్నంగా ఉంటాయని అన్నారు. కొన్ని దోమలు ఎప్పుడు వస్తాయో ఎప్పుడు కుడతాయో ఎప్పుడు మాయమైపోతాయో మనకు అర్థంకాదన్నారు. కార్యక్రమంలో కళాకారులు రాంపూర్ సాయి లవోల, రాజు, రవినాయక్, మీనా, రాజేందర్, మనోజ్, సతీష్ పాల్గొన్నారు.

ఆటోనగర్‌లో చోరీ

ఖిల్లా, జూలై 18: నగరంలోని ఆరవ టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో గల ఆటోనగర్‌లో చోరీ జరిగింది. ఆటోనగర్‌కు చెందిన ఫసియొద్దీన్ తన కుటుంబ సభ్యులతో శనివారం ఇంటికి తాళం వేసి హైదరాబాద్ వెళ్లారు. తాళం వేసి ఉన్న ఇంటిని గమనించిన గుర్తుతెలియని వ్యక్తులు తాళం పగలగొట్టి ఇంట్లోకి చొరబడి బీరువాను ధ్వంసం చేశారు. అందులో ఉన్న రూ.3లక్షల 50వేలను ఎత్తుకెళ్లారు. ఫసియొద్దీన్ కుటుంబం బుధవారం రాత్రి ఇంటికి చేరుకోగా తాళం పగిలి ఉండటాన్ని గమనించి లోనికి వెళ్లి చూడగా బీరువా ధ్వంసం చేసి అందులో ఉన్న నగదు లేకపోవడంతో దొంగతనం జరిగిన విషయాన్ని పోలీసులకు సమాచారం అందించారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటన స్థలానికి చేరుకొని దొంగతనం జరిగిన తీరును పరిశీలించారు. బాధితుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై మొగులయ్య తెలిపారు. ఫసియొద్దీన్ ఇసుక వ్యాపారం చేస్తుంటాడని అందుకోసమే ఇంట్లో నగదు పెట్టి వెళ్లినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారని తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో గాయపడ్డ చిన్నారి మృతి

నిజామాబాద్ అర్బన్, జూలై 18: ఈనెల 14న మాక్లూర్ మండలం దాస్‌నగర్ వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో మరో విషాదం చోటు చేసుకుంది. ఆ ప్రమాదంలో తీవ్రంగా గాయపడి నగరంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతూ గురువారం శ్రీరాం ఈశ్వరి (13) అనే విద్యార్థిని మృతి చెందగా ఆ కుటుంబంలో విషాదం నింపింది. బోధన్ మండలం చిన్నమావంది గ్రామానికి చెందిన శ్రీరాం ఈశ్వరి దాస్‌నగర్ వద్ద గల జ్యోతిబాపూలే బాలికల వసతిగృహంలో 8వ తరగతి చదువుతుంది. ఈనెల 14న ఆదివారం వసతిగృహంలో ఉంటున్న ఈశ్వరిని చూసేందుకు ఆమె తల్లి, తండ్రి, అక్క రాగా రోడ్డు పక్కన ఈశ్వరితో తల్లిదండ్రులు మాట్లాడుతుండగా మద్యం మత్తులో కారు డ్రైవర్ కారును వారిపైకి తీసుకెళ్లడంతో ఆ ప్రమాదంలో ఈశ్వరి తల్లి శ్రీరాం పద్మ సంఘటన స్థలంలోనే మృతి చెందింది. తీవ్రంగా గాయపడిన ఈశ్వరితో పాటు ఆమె అక్క గౌతమిని నగరంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చేర్పించారు. ఈ క్రమంలో ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న ఈశ్వరి పరిస్థితి విషమించడంతో గురువారం ఉదయం మృతి చెందింది. కారు ప్రమాదంలో ఇప్పటికే తల్లి మృతి చెందగా గురువారం కూతురు ఈశ్వరి సైతం మృతి చెందడంతో ఆ కుటుంబంలో విషాదం అలుముకుంది.

రూరల్ ఎంపీవో మధురిమ బదిలీ

నిజామాబాద్ రూరల్, జూలై 18: రూరల్ మండల మండల పరిషత్ అధికారి (ఎంపీవో) మదురిమ బదిలీ అయ్యారు. ఆమె స్థానంలో మోపాల్ ఎంపీవోగా విదులు నిర్వహిస్తున్న ఇక్బాల్‌ను నియమించారు. రూరల్ మండల ఎంపీవో గా 5 సంవత్సరాల పాటు విదులు నిర్వహించిన మధురిమ చందూర్ మండలానికి బదిలీ అయ్యారు. మదురిమ రూరల్ మండల ఇన్‌చార్జీ ఎంపీడీవోగా సైతం అదనపు బాధ్యతలు నిర్వహిస్తున్నారు. రూరల్ మండలంలో పంచాయతీ కార్యదర్శులుగా పనిచేస్తున్న ముగ్గురికి బదిలీలు జరిగాయి. వారిలో కేశాపూర్‌లో విదులు నిర్వహిస్తున్న విష్ణు నాయక్, మల్కాపూర్ (ఎ) ఆనంద్‌కుమార్, మల్కాపూర్ తండాలో సెక్రటరీగా విధులు నిర్వహిస్తున్న సంతోష్‌లకు బదిలీలయ్యాయి. వీరి స్థానంలో కొత్తవారు బాధ్యతలు తీసుకున్న తర్వాత వీరు రిలీవ్ కానున్నట్లు ఎంపీవో మధురిమ తెలిపారు.

నగర సమస్యలను పరిష్కరించండి

సుభాష్‌నగర్, జూలై 18: నగరంలోని ప్రజలు సమస్యలతో ఇబ్బందులు పడుతున్నారని ప్రజల సమస్యలను పరిష్కరించాలని సీపీఎం ఆధ్వర్యంలో గురువారం నగర పాలక సంస్థ మేనేజర్ జనార్దన్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగ సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు సుజాత మాట్లాడుతూ నగరంలో కుక్కల బెడద రోజురోజుకి పెరిగిపోతుందన్నారు. చిన్న పిల్లలపై, పెద్దవారిపై, వాహనాలపై వెళ్తున్న వారిపై దాడులు చేస్తున్నాయని కుక్కల బెడదను తప్పించాలని కోరారు. ప్లాస్టిక్ వాడకం ఎక్కువై రోడ్లపై పారేయడం వల్ల ప్లాస్టిక్‌ను తిని పశువులు మరణిస్తున్నాయని వాటి ప్రాణాలను కాపాడాలన్నారు. నగరంలో వర్షాల కారణంగా రోడ్లపై గుంతలు ఏర్పడ్డాయని గుంతల వల్ల వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. డ్రైనేజీలో నీరు నిలువ వల్ల దోమలతో సీజనల్ వ్యాధులు వ్యాపిస్తున్నాయని అన్నారు. రోడ్లపై గుంతలు పూడ్చి ప్రజల ప్రాణాలను కాపాడాలని కోరారు. ఈ కార్యక్రమంలో కటారి రాములు, నర్సయ్య తదితరులు పాల్గొన్నారు.

రైతును రాజును చేయడమే కాంగ్రెస్ లక్ష్యం

● రూరల్ ఎమ్మెల్యే డాక్టర్ ఆర్ భూపతిరెడ్డి

నిజామాబాద్ రూరల్, జూలై 18: అసెంబ్లీ ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు రైతులకు ఏకకాలంలో రూ.2 లక్షల రుణమాఫీ చేస్తున్నామని, దీంతో రైతన్నల కన్నుల్లో వెలుగులు నిండాయని, రైతును రాజును చేయడమే కాంగ్రెస్ పార్టీ అజెండా అని నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే డాక్టర్ ఆర్.భూపతిరెడ్డి అన్నారు. బుధవారం రూరల్ మండలం గుండారంలో 'రైతు రుణమాఫీ'పై రైతులతో సమావేశం నిర్వహించారు. అనంతరం అడిషనల్ కలెక్టర్ అంకిత్ కిరణ్‌కుమార్, ఆర్డీవో రాజేంద్ర ప్రసాద్‌లతో కలిసి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సీఎం రేవంత్ రెడ్డి ప్రకటించిన పాలసీని రైతువేదికలో ఎమ్మెల్యే భూపతిరెడ్డి తిలకించారు. ఈ సమావేశంలో సొసైటీ చైర్మన్లు దాసరి శ్రీధర్, నాగేశ్వర్‌రావు, పైస స్వామి, కౌలాస్ శ్రీనివాస్, కాంగ్రెస్ నేతలు భాగర్తి భాగారెడ్డి, మాజీ సర్పంచ్‌లు దాసరి ఒడ్డెన్న, కొర్వ గంగాధర్, కౌలాస్ మోహన్, మూత జనార్ధన్, ఎల్లయ్య, క్యాతం హన్మాండ్లు, కొర్వ రాజేందర్, కుంచెపు నగేష్, నాశెట్టి నెహ్రూ తదితరులున్నారు.

మోపాల్: ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఇచ్చిన మాట ప్రకారం రైతులకు ఒకేసారి రెండులక్షల రూపాయల రుణమాఫీ చేయడం పట్ల గురువారం మండల కేంద్రంలోని రైతువేదిక వద్ద కాంగ్రెస్ నాయకులు కేక్ కట్ చేసి పెద్ద ఎత్తున సంబరాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ కిసాన్‌కేత్ జిల్లా అధ్యక్షుడు ముప్పగంగారెడ్డి, ఐడీసీఎంఎస్ డైరెక్టర్ గోర్కంటి లింగన్న, మాజీ ఎంపీపీ యాదగిరి, మాజీ జడ్పీటీసీ మోహన్, బాడ్సీ సొసైటీ చైర్మన్ మోహన్‌రెడ్డి, నాయకులు, రైతులు పాల్గొన్నారు.

ఇందల్వాయి: మండల కేంద్రంలోని రైతువేదిక, నల్లవెల్లి రైతువేదిక, లోలం గ్రామంలోని రైతువేదికల్లో సీఎం రేవంత్‌రెడ్డి, నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే డాక్టర్ భూపతిరెడ్డి చిత్రపటాలకు పాలాభిషేకం చేసి రైతులు ఘనంగా సంబరాలు జరుపుకున్నారు. ఇందల్వాయి రైతువేదిక వద్ద టపాకాయలు కాల్చి ఒకరినొకరు స్వీట్లు పంచిపెట్టుకున్నారు. కార్యక్రమంలో ఇందల్వాయి సొసైటీ చైర్మన్ గోవర్ధన్‌రెడ్డి, నల్లవెల్లి చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు నవీన్‌గౌడ్, ముదిరాజ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఇమ్మడిగోపి, ఎన్‌డీసీసీ డైరెక్టర్ ఆనంద్, నోడల్ అధికారిని పద్మావతి, తహశీల్దార్ వెంకట్‌రావు, నాయకులు, రైతులు పాల్గొన్నారు.



సమావేశంలో రైతులతోమాట్లాడుతున్న రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డి



కేక్ కట్ చేసి సంబరాలు చేసుకుంటున్న కాంగ్రెస్ పార్టీ నాయకులు

ధర్పల్లి: మండలంలో రైతు రుణమాఫీపై గురువారం కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో రైతులు సంబరాలు చేసుకున్నారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు ఆర్మూర్ చిన్నబాల్‌రాజ్, మహేందర్, నర్సారెడ్డి, చెలిమెల శ్రీనివాస్, వైజిఆర్, రైతులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.

సిరికొండ: మండలంలో రైతు రుణమాఫీపై గురువారం కాంగ్రెస్ ఆధ్వర్యంలో రైతులు సంబరాలు చేసుకున్నారు. కార్యక్రమంలో పీఏసీఎస్ అధ్యక్షుడు గంగాధర్, ఉపాధక్షుడు నర్సయ్య, పార్టీ మండల అధ్యక్షుడు రవి, కిసాన్‌ఖేత్ విభాగం అధ్యక్షుడు నర్సారెడ్డి, రైతులు పాల్గొన్నారు.

నిజామాబాద్ అర్బన్: ఏకకాలంలో రైతులకు లక్ష రుణ మాఫీ చేసిన సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి గురువారం కాంగ్రెస్ శ్రేణులు నగరంలో పాలాభిషేకం చేశారు. జిల్లా కాంగ్రెస్ కార్యాలయం నుంచి ర్యాలీగా వచ్చిన కాంగ్రెస్ నాయకులు ఎన్టీఆర్ చౌరస్తాలో సీఎం చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. కార్యక్రమంలో నాయకులు రాంభూపాల్, సంతోష్, చంద్రకళ, ఉషా, అపర్ణ, విక్కియాదవ్, కేశమహేష్ పాల్గొన్నారు.

రైతాంగానికి ఇచ్చిన హామీ మేరకు రుణమాఫీ..



రైతాంగానికి ఇచ్చిన హామీ మేరకు రుణమాఫీ చేసి రైతుల కళ్లల్లో ఆనందం చూసేలా చేసిన సీఎం రేవంత్‌రెడ్డికి జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు, రాష్ట్ర కోఆపరేటివ్ సొసైటీ చైర్మన్ మానాల మోహన్‌రెడ్డి ధన్యవాదాలు తెలిపారు. రాష్ట్ర ప్రజలకు ఎన్నికల సందర్భంగా రైతు డిక్లరేషన్‌లో రాహుల్‌గాంధీ ఇచ్చిన హామీని సీఎం అమలు చేశారని గత ప్రభుత్వాల వలే మాయమాటలు చెప్పకుండా రైతుల ఇబ్బందులు తెలుసుకున్న గొప్ప నాయకుడు రేవంత్‌రెడ్డి అని మానాల మోహన్‌రెడ్డి అన్నారు.

ఉపాధ్యాయులు వేధింపులకు గురి చేస్తున్నారు

● పోలీస్ స్టేషన్‌లో జిల్లా విద్యాశాఖ అధికారి ఫిర్యాదు

నిజామాబాద్ అర్బన్, జూలై 18: జిల్లా విద్యాశాఖలో పనిచేస్తున్న పలువురు ఉపాధ్యాయులు, రిటైర్డ్ ఉపాధ్యాయులు తనను వేధిస్తున్నారని జిల్లా విద్యాశాఖ అధికారి ఎన్.వి.దుర్గాప్రసాద్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. విశ్రాంత ఉపాధ్యాయుడు శంతన్, స్కూల్ అసిస్టెంట్లు బాలయ్య, ఓమాజీలు తరచూ తనపై వ్యక్తిగతంగా తప్పుడు ప్రకటనలు చేయిస్తున్నారని ఆయన తెలిపారు. తనను మానసికంగా క్షోభకు గురి చేస్తున్నారని ఈ మేరకు తాను ఈనెల 1వ తేదీన నిజామాబాద్ రూరల్ పోలీస్ స్టేషన్‌లో పోలీసులకు ఫిర్యాదు చేశానని అయినప్పటికీ తనపై పత్రికల ద్వారా, సోషల్ మీడియాలో వ్యక్తిగతంగా విమర్శలు చేస్తున్నారని ఆయన అన్నారు. ఈ విమర్శల వల్ల తనతో పాటు తన కుటుంబ సభ్యులు మానసిక ఒత్తిడికి లోనవుతున్నారని వారి నుంచి తనకు ప్రాణభయం ఉందని ఫిర్యాదులో డీఈవో పేర్కొన్నారు. తనకు ఏదైనా జరిగితే వారే బాధ్యత వహించాల్సి ఉంటుందని తెలిపారు. ఇటీవల జరిగిన ఉపాధ్యాయ బదిలీలలో కొంత మంది ఉపాధ్యాయులకు అన్యాయం జరిగిందని, క్యామ్ స్కానర్ పేరుతో అక్రమాలు జరిగాయని విశ్రాంత ఉపాధ్యాయుడు శంతన్, ఇతర ఉపాధ్యాయులు పలుమార్లు పత్రిక ప్రకటనలు ఇచ్చారు. పలుమార్లు వారికి డీఈవో చెప్పినప్పటికీ వారు తీరు మారకపోవడంతో డీఈవో పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు తెలిసింది.

వ్యక్తిగత ఆరోపణలు చేయలేదు...

జిల్లా విద్యాశాఖ అధికారి తాను వ్యక్తిగత ఆరోపణలు చేసినట్లు ప్రకటన విడుదల చేయడం సరికాదని డీటీఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు శంతన్ ఒక ప్రకటనలో తెలిపారు. ఉపాధ్యాయ బదిలీలలో అక్రమాలు జరిగాయని ఆరోపించామే తప్ప.. వ్యక్తిగత ఆరోపణలు చేయలేదని వెబ్ కౌన్సెలింగ్‌లో అనేక అక్రమాలపై తమ వద్ద ఆధారాలు ఉన్నాయని ఉపాధ్యాయ సంఘంగా సామాజిక బాధ్యతతో అక్రమాలపై ఫిర్యాదు చేయడం జరిగిందని ఆయన తెలిపారు.

ఆశా వలంటీర్ల డిమాండ్లను నెరవేర్చాలి

నిజామాబాద్ రూరల్, జూలై, 18: ప్రజల ఆరోగ్యరక్షణ కోసం అహర్నిశలు శ్రమిస్తున్న ఆశ వలంటీర్లకు ఫిక్స్‌డ్ శాలరీ (శాశ్వత వేతనం)తోపాటు న్యాయమైన డిమాండ్లు అమలుచేయాలని కోరుతూ ఆశ వాలంటీర్లు రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డికి వినతిపత్రం సమర్పించారు. బుధవారం రూరల్ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో సీఐటీయూ ఆధ్వర్యంలో ఆశవాలంటీర్లు పెద్ద ఎత్తున తరలివచ్చారు. ఎమ్మెల్యే భూపతిరెడ్డిని కలిసి తమ సమస్యలు చెప్పుకున్నారు. సమ్మె కాలంలో తమకు రావలసి వేతనాన్ని వెంటనే ఇప్పించాలని కోరారు. ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ మానిఫెస్టోలో పెట్టిన విధంగా హామీలు అమలుచేయాలని కోరారు. న్యాయమైన తమ 24 డిమాండ్లను నెరవేర్చావిధంగా సీఎం రేవంత్ రెడ్డికి వివరించాలని కోరారు. ఈ సమావేశంలో సీఐటీయూ నేతలు రమేష్‌బాబు, ఆశ వాలంటీర్లు రమ, బాలమణి, స్వప్న, పద్మ, నిర్మల తదితరులున్నారు.

ఆశావర్కర్ల సమస్యలు పరిష్కరించాలి

పెద్దబజార్: ఆశావర్కర్ల సమస్యలు పరిష్కరించాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి నూర్జహాన్ డిమాండ్ చేశారు. గురువారం నగరంలోని గాంధీచౌక్ నుంచి అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ నివాసం వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఎమ్మెల్యే వినతిపత్రం అందజేసి ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఆశలు హెల్త్ డిపార్ట్‌మెంట్‌లో పనిచేస్తున్నారని ప్రజలకు సేవలు అందిస్తున్నారని అన్నారు. ఆశలకు జీతాలు చాలా తక్కువగా ఉన్నాయని కనీసం ప్రభుత్వ వేతనాలు అమలు చేసే విధంగా అసెంబ్లీ సమావేశాల్లో సమస్యలపై మాట్లాడుతానని ధన్‌పాల్ సూర్యనారాయణ హామీ ఇచ్చారు. అనంతరం నూర్జహాన్ మాట్లాడారు. సమస్యలు పరిష్కరించకుంటే ఈనెల 22న కలెక్టరేట్‌ను ముట్టడిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఆశావర్కర్లు తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ ప్రమాదాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

సుభాష్‌నగర్, జూలై 18: విద్యుత్ ప్రమాదాల పట్ల నిజామాబాద్ టీజీఎన్‌పీడీసీఎల్ సర్కిల్ పరిధిలో ప్రజలకు అవగాహన కల్పిస్తున్నామని జిల్లా టీజీఎన్‌పీడీసీఎల్ సూపరింటెండెంట్ ఇంజనీర్ రవీందర్ తెలిపారు. బట్టలు ఆరవేసే జీఐ దండెము, విద్యుత్ వైర్లపై నుంచి వెళ్లడం వల్ల విద్యుత్ సరఫరా అయి ప్రమాదం జరిగే అవకాశం ఉందని తెలిపారు. బట్టలు ఆరవేసే దండెంలను ప్లాస్టిక్‌వే ఉపయోగించాలని కోరారు. ఇంటి ముందు ఉన్న రేకులకు విద్యుత్ సరఫరా అయ్యే ప్రమాదం ఉందని రేకులకు తగలకుండా జాగ్రత్త వహించాలన్నారు. విద్యుత్ వినియోగదారుల గృహాల్లో నాణ్యమైన వైరింగ్ లేకపోవడం, నాసిరకంగా ఉన్న విద్యుత్ పరికరాలు వాడటం వల్ల విద్యుత్ ప్రమాదాలు తరచుగా జరుగుతున్నాయని అన్నారు.

హెచ్‌సీఏ ఎంపికలో జిల్లా క్రీడాకారిణులకు చోటు

సుభాష్‌నగర్, జూలై 18: హెచ్‌సీఏ నిర్వహించిన మహిళా క్రికెట్ ఎంపికలో జిల్లా క్రీడాకారిణిలు ఎంపికయ్యారు. జూన్ 29న ఉప్పల్ స్టేడియంలో నిర్వహించిన ఈ పోటీలో వీరు పాల్గొని తమ ప్రతిభను కనబర్చారు. ఈ క్రీడాకారిణిలను హెచ్‌సీఏ మహిళా క్రికెట్ లీగ్‌లో పాల్గొననున్నట్లు కోచ్ బాగారెడ్డి తెలిపారు. వీరు గత కొంతకాలంగా బాగారెడ్డి పర్యవేక్షణలో క్రికెట్ శిక్షణ తీసుకుంటున్నారు. మహిళా క్రికెట్ ఎంపికలకు జిల్లాకు చెందిన క్రీడాకారులు ఎంపిక కావడం పట్ల అసోసియేషన్ సభ్యులు హర్షం వ్యక్తం చేశారు.

టీయూ బాలికల హాస్టల్‌లో సాంబార్‌లో పురుగులు

● కేర్ టేకర్‌పై ఆగ్రహం వ్యక్తం చేసిన విద్యార్థినులు

డిచ్‌పల్లి, జూలై 18: డిచ్‌పల్లిలోని తెలంగాణ విశ్వవిద్యాలయంలో గురువారం రాత్రి బాలికల హాస్టల్‌లో భోజనం చేస్తున్న విద్యార్థులకు సాంబారులో పురుగులు వచ్చాయి. ఈ భోజనాన్ని చూసిన విద్యార్థినులు ఒక్కసారిగా కంగుతిన్నారు. దీంతో తాము ఈ భోజనం చేయలేమని హాస్టల్ కేర్ టేకర్‌కు విద్యార్థినులు తేల్చిచెప్పారు. ఇలా ఎన్నిమార్లు పురుగుల భోజనం పెడుతూ తమ ఆరోగ్యాన్ని దెబ్బతీస్తారని వారు ఆగ్రహం వ్యక్తం చేశారు. విషయం తెలుసుకున్న ఏబీవీపీ నాయకులు బాలికల హాస్టల్‌కు వచ్చి సంబంధిత శాఖ వార్డెన్‌లను, కేర్ టేకర్‌లను నిలదీసి ప్రశ్నించారు. యూనివర్సిటీ అధికారుల నిర్లక్ష్యమే ఇందుకు కారణమని వారు ఆరోపించారు. ఈ విషయంలో శుక్రవారం విశ్వవిద్యాలయంలో ఆందోళన చేస్తామని హెచ్చరించారు.

మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలి

ఖిల్లా, జూలై 18: యుక్త వయస్సులో ఉన్న వారు మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలని ఒకటవ టౌన్ ఎస్‌హెచ్‌వో డి.విజయ్ బాబు తెలిపారు. పోలీస్ కమిషనర్ కల్మేశ్వర్ సింగనెవార్ ఆదేశాల మేరకు గురువారం నగరంలోని ఎస్ఎస్ఆర్ కళాశాల విద్యార్థులకు మాదక ద్రవ్యాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాదక ద్రవ్యాలపై అలవాటు పడితే జరిగే నష్టాలపై యువతకు వివరించారు. యువత సద్మార్గంలో నడిచి ఉన్నత చదువులు చదవాలని ఎటువంటి దురలవాట్లకు పాల్పడరాదని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎస్ఆర్ కళాశాల విద్యాసంస్థల చైర్మన్ మారయ్య గౌడ్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

సిరికొండ: మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలని సీఐ భిక్షపతి విద్యార్థులను కోరారు. సిరికొండలో గిరిజన బాలుర ఆశ్రమ పాఠశాలలో విద్యార్థులకు మాదక ద్రవ్యాలపై గురువారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ.. గంజాయి, హెరాయిన్, గుట్కాల వంటి మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలన్నారు. ఇంటర్మీడియట్, డిగ్రీ, బీటెక్ చదివే విద్యార్థులు మత్తు పదార్థాలకు బానిసలై బంగారు లాంటి జీవితాలను నాశనం చేసుకుంటున్నారని ఆయన విద్యార్థులకు వివరించారు. హైస్కూల్ సాయిలో ఉన్న మీరు వాటిని దరిచెరనీయొద్దని సీఐ భిక్షపతి విద్యార్థులకు సూచించారు.



గన్నారంలో జలాభిషేకం చేసేందుకు నీటి బిందెలతో వెళ్తున్న మహిళలు

వర్షాలు కురవాలని గ్రామదేవతలకు జలాభిషేకం

ఇందల్వాయి, జూలై 18: వర్షాలు సమృద్ధిగా కురవాలని గ్రామస్తులు గంగాజలంతో గ్రామదేవతలకు జలాభిషేకం చేశారు. ఇందల్వాయి మండలంలోని గన్నారం గ్రామంలో గ్రామాభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో గురువారం గంగాజలాన్ని తీసుకొచ్చి గ్రామంలో ఉన్న అన్ని దేవాలయాల్లో మహిళలు, యువకులు పెద్ద ఎత్తున తరలివచ్చి గంగాజలంతో అభిషేకం చేశారు. గోదావరి నది నుండి నీళ్లు తీసుకొచ్చి గ్రామంలోని ప్రతి ఆలయంలో జలాభిషేకం చేసినట్లు గ్రామస్తులు తెలిపారు. వర్షాకాలం ప్రారంభమై రెండు నెలలు కావస్తున్న సరైన వర్షాలు కురవక చెరువులు, కుంటలు నీళ్లలేక బోసిపోయాయని అన్నారు. ఇకనుండైనా భారీ వర్షాలు కురిసి పంటలు బాగా పండాలని అభిషేకం చేసి ప్రత్యేక పూజలు చేసినట్లు గ్రామస్తులు తెలిపారు. ఈకార్యక్రమంలో గ్రామశాఖ అధ్యక్షుడు పల్లరాజేశ్వర్, స్వామి, కోశాధికారి నవీన్, బాలయ్య, ఎర్రగంగాధర్, సాయిలు, గ్రామ యువకులు, మహిళలు పాల్గొన్నారు.

తండాల్లో ఎక్సైజ్ సిబ్బంది దాడులు

సిరికొండ, జూలై 18: మండలంలోని వర్షన్ తండా, చీన్యనాయక్ తండా, ఒంటిప్ప తండాల్లో ఎక్సైజ్ టాస్క్‌ఫోర్సు సిబ్బంది దాడులు చేసి ఇప్పపువ్వును, 11 లీటర్ల నాటు సారాను స్వాధీనం చేసుకున్నారు.ఐదు గురిపై కేసు నమోదు చేసినట్లు సీఐ వేణుమాధవ్‌రావు తెలిపారు. ఈ దాడుల్లో టాస్క్‌ఫోర్సు ఎస్సై విలాస్, ఎక్సైజ్ సిబ్బంది పాల్గొన్నారు.

గడ్కోల్లో ఘనంగా ఊర పండగ

సిరికొండ, జూలై 18: మండంలోని గడ్కోల్ గ్రామంలో గురువారం ఊర పండగను ఘనంగా నిర్వహించుకున్నారు. 18 ఏళ్ల తర్వాత రాయితో గ్రామ దేవతల విగ్రహాలను చేయించి ప్రతిష్టాపన చేయించారు.

ఘనంగా తీజ్ పండుగ

ధర్పల్లి, జూలై 18: మండలంలోని గిరిజన తాండాలో తీజ్ పండుగను గిరిజనులు సాంప్రదాయ బద్దంగా జరుపుకున్నారు. గురువారం మండలంలోని గుడితాండా, ఇందిరానగర్ తాండా, మద్దుల్ తాండా, తదితర తాండాల్లో గిరిజనులు భక్తిశ్రద్ధలతో పండుగను నిర్వహించారు. గోదుమనారును యువతులు గ్రామ శివారులోగల చెరువుల్లో నిమజ్జనం చేశారు. పంటలు సమృద్ధిగా పండాలని మంచి భర్త దొరకాలని కోరుతూ పండుగను జరుపుకున్నారు. ఈ వేడుకల్లో మండల పార్టీ అధ్యక్షుడు ఆర్మూర్ చిన్నబాల్‌రాజ్, జిల్లా అధికార ప్రతినిధి చెలిమెల నర్సయ్య, చెలిమెల శ్రీనివాస్, లింబ్యానాయక్, మోతిరాం నాయక్, తాండా పెద్దలు, పాల్గొన్నారు.

PUBLIC NOTICE

General public are hereby in formed that my client M/S Shriram Finance Ltd., Bodhan branch, agreed to accord loan to Borrower : ANSAR AHMED S/O MD RAZAQ, Aged 55 Years OCC:-Business, R/o H.No.1-4-106, Sharbathi canal, Bodhan Town & Mandal, Nizamabad Dist Property holder : MEHAR BANU W/O ANSAR AHMED Aged 50 Years OCC: Business, R/o H.No. 1-4-106, Sharbathi canal, Bodhan Town & Mandal, Nizamabad Dist by mortgage of the schedule property mentioned below. The above prospective loanee agreed to create first charge against property mentioned below in favour of my client company. If any person having any title, claim, or objection of what so ever nature may put forth their claims before me within 7 days of this notice. The objection raised afterwards shall be deemed to be "Waived" and not binding on my client company and my client shall proceed further for according above loan

Schedule

The Existing A.C.C Roof House Bearing old No.1-4-94 New House.No. 1-4-106, Area of admeasuring 83.33 Sq yards or 750.00 sq fts or out of which A.C.C Roof house Ground floor Plinth Area 655.57 sq fts or 72.84 sq yards Situated Sharbathicanal Bodhan Town & Mandal Nizamabad Dist The Under the Jurisdiction of Registration Dist Nizamabad Sub Dist Bodhan

Bounded as under.

East: 20 Feets wide Road, **West:** Combined Wall & House of SK. Mustafa **North:** Combined Wall & House of M.Ismail, **South:** 20 Feets wide Road

K. SUBBA RAO, B.sc. LLB
Advocate, Bodhan, Ph:9440004201

హత్య కేసులో ఒకరికి జీవిత ఖైదు

నిజామాబాద్ లీగల్, జూలై 18: మహిళను హత్య చేసి ఆమె ఒంటిపై నుంచి బంగారం తీసుకున్న అన్రాసి వెంకట్‌రెడ్డికి గురువారం జీవితఖైదు శిక్ష విధిస్తూ జిల్లా సెషన్స్ జడ్జి సునీత కుంచాల తీర్పు చెప్పారు. వివరాల్లోకి వెళితే... ఆలూరు గ్రామానికి చెందిన అన్రాసి వెంకట్‌రెడ్డి, అతని భావ కడమంచి సురేష్ పేయింటింగ్ వేసుకొని జీవిస్తూ ఉండేవాడు. అదే గ్రామానికి చెందిన కొత్తూరు గంగ (65) వెంకట్‌రెడ్డితో పరిచయం ఏర్పడి తన ఇంటి సమస్యలపై తరచూ చర్చించేది. వెంకట్‌రెడ్డి ఆమె ఒంటిపై ఉన్న బంగారాన్ని కాజేయాలనే దురుద్దేశంతో పతకం పన్ని 27-09-2022 నాడు మృతురాలితో కుటుంబ సమస్యలు తీరాలంటే ఊరు చివర మంత్రం వేయాలని చెప్పి ఆమెను నమ్మించి ఎస్సారెస్పీ బ్యాక్ వాటర్ వద్ద అతని బావ సహాయంతో తీసుకువెళ్లి నీటిలో స్నానం చేయమని చెప్పి మునిగిన తర్వాత తన కొంగుతో మెడకు బిగించి నీటిలోనే హత్యచేసి మహిళ ఒంటిపై ఉన్న బంగారాన్ని తీసుకొని వెళ్లిపోయాడు. మృతురాలు కనబడటం లేదని తన కోడలు ఆర్మూర్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా విచారణ చేపట్టిన పోలీసులు వీరిని అదుపులోకి తీసుకొని కోర్టులో సాక్షాధారాలతో హాజరుపర్చగా పీపీ రవిరాజు పోలీసువారి తరపున వాదించారు. సాక్షాధారాలను పరిశీలించిన జడ్జి ముద్దాయి సురేష్‌పైన నేరం రుజువు కాకపోవడంతో అతనిపై కేసు కొట్టివేస్తూ మరో ముద్దాయి వెంకట్‌రెడ్డికి జీవితఖైదు, 4వేల రూపాయల నగదు జరిమానా విధించాలని తీర్పు చెప్పారు.

'మోదీ ప్రభుత్వం కఠినంగా వ్యవహరిస్తోంది'

పెద్దబజార్, జూలై 18: మోటార్ కార్మికుల పట్ల మోదీ ప్రభుత్వం కఠినంగా వ్యవహరిస్తోందని తెలంగాణ ప్రగతిశీల ఆటో అండ్ మోటార్స్ వర్కర్స్ ఫెడరేషన్ (ఐఎఫ్‌టీయూ) నాయకుడు శివకుమార్ అన్నారు. గురువారం నగరంలోని అర్సపల్లిలోగల ఐఎఫ్‌టీయూ ఆధ్వర్యంలో పోస్టర్‌లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈనెల 21న ఇల్లెందులో జరిగే తెలంగాణ ప్రగతిశీల ఆటో అండ్ మోటార్స్ వర్కర్స్ ఫెడరేషన్ రాష్ట్ర ఐదవ మహాసభను జయప్రదం చేయాలని అన్నారు. రాష్ట్ర రవాణా సంఘంలో 25లక్షల మంది కార్మికులు పనిచేస్తున్నారని వీరికి సంక్షేమ బోర్డు లేకపోవడం వల్ల కార్మికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. డ్రైవర్లకు ఉరితాడుగా మారిన హిట్ అండ్ రన్ చట్టాన్ని రద్దు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పది సంవత్సరాలుగా రాష్ట్రాన్ని పాలించిన బీఆర్ఎస్.. మోటారు కార్మికులకు సంక్షేమ బోర్డును ఏర్పాటు చేయలేదని నేటి కాంగ్రెస్ ప్రభుత్వమైన బోర్డును ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు ప్రసాద్, మోహన్, యూసుఫ్, జానీ హైమద్ ఖాన్, రాజు పాల్గొన్నారు.

చికెన్ ధరలు

రకం	లైవ్	విత్‌స్కిన్	స్కిన్‌లెస్
సుగుణ (కిలో)	రూ.120	రూ.230	రూ. 250
వెన్‌కాబ్(కిలో)	రూ.125	రూ.235	రూ. 255

బంగారం ధరలు

బిస్కెట్ (10 గ్రా.)	ఆర్నమెంట్(10 గ్రా.)	వెండి(10 గ్రా.)
రూ.75,000	రూ.69,000	రూ.945

సినిమా గైడ్ నిజామాబాద్

పీవీఆర్ మల్టీప్లెక్స్..

స్క్రీన్-1 : కల్కి(3డి తెలుగు) (11.00, 6.30)
: భారతీయుడు-2 (2.45)
: ట్విస్టర్స్ : (ఇంగ్లీష్) (10.15)
స్క్రీన్-2 : బ్యాడ్ న్యూజ్ (హిందీ) (10.45, 1.50, 7.25, 10.30)
: కిల్ (హిందీ) (4.55)
స్క్రీన్-3 : ట్విస్టర్స్ : (ఇంగ్లీష్) (10.15)
: డార్లింగ్ (1.05, 7.00, 10.20)
: జస్ట్ ఎ మినట్ (4.25)
స్క్రీన్-4 : డార్లింగ్ (10.40)
: ట్విస్టర్స్ : (ఇంగ్లీష్) (2.00, 7.30)
: ది బర్త్‌డే బాయ్ (4.50)
: పేక మేడలు (10.20)

ఉషాప్రసాద్ మల్టీప్లెక్స్..

స్క్రీన్-1 : కల్కి (తెలుగు) (1.00, 7.25)
: డార్లింగ్ (4.30, 10.50)
స్క్రీన్-2 : భారతీయుడు-2 (10.20)
: కల్కి (తెలుగు) (4.10, 10.40)
స్క్రీన్-3 : కల్కి (తెలుగు) (10.20)
: భారతీయుడు-2 (1.45, 10.45)
: డార్లింగ్ (7.50)

దేవి : భారతీయుడు-2 (11.15, 2.15, 6.15, 9.15)
నటరాజ్ : భారతీయుడు-2 (హిందీ) (11.15, 2.15, 6.15, 9.15)
విజయ్ : కల్కి (11.15, 2.15, 6.15, 9.15)



- నిజామాబాద్ అర్బన్